తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం-27-అక్టోబర్-2025 | సంపుటి:3 | సంచిక:148 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in




# ఇబ్బందులు పోవాలంటే..
# మన ప్రభుత్వం రావాలి : కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 26(తెలంగాణ ముచ్చట్లు)

రెండేళ్లుగా ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో మాకు తెలుసునని.. ఇబ్బందులు పోవాలంటే మన ప్రభుత్వమే రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్‌పేట డివిజన్‌లోని హమాలీ బస్తిలో మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బొడ్రాయి పండుగను బస్తీ వాసులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హమాలీ బస్తీ వాసులు బీఆర్ఎస్ నేతలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నేతలందరూ బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మాట్లాడుతూ పల్లెటూర్లలో మాత్రమే నిర్వహించే బొడ్రాయి పండుగ ను హమాలీ బస్తీలో ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఒక్క సనత్ నగర్ నియోజకవర్గంలోనే కాకుండా హైదరాబాద్‌లో ఎక్కడ ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలిచే గొప్ప నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని.. బుద్ధి చెప్పాలి అంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కారుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో..

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఖాయం
## మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 26
(తెలంగాణ ముచ్చట్లు)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 46వేల మంది చిన్నారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. మంత్రుల పంచాయితీ ముగిసిన అధ్యాయమని పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పరిస్థితులను పార్టీ హైకమాండ్ గమనిస్తోందన్నారు.

కొందరు ఎమ్మెల్యేలకు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని మహేశ్‌కుమార్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. తొలి నుంచి పార్టీకి సేవచేసిన కుటుంబాలకు అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి సరైన సహకారం లేదని ఆయన ఆరోపించారు. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, ఆ తర్వాత అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడాలని అన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్2 పనులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డంకులు పెడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 10 ఏళ్లు భారత రాష్ట్రసమితి అభ్యర్థులే గెలిచారని, మరి ఓట్ చోరీ ఎవరు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తొలుత ఫిర్యాదు చేసింది సీఎం రేవంత్‌రెడ్డే అని గుర్తు చేశారు. అధికారులు, మంత్రులు ఎవరైనా జవాబుదారీగా ఉండాలని సూచించారు.





# రేబిస్ వ్యాధితో బాలిక మృతి

హైదరాబాద్, అక్టోబర్ 26(తెలంగాణ ముచ్చట్లు)

నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో వీధి కుక్క కాటుతో రేబిస్ వ్యాధి సోకి చిన్నారి మృతి చెందింది. గ్రామానికి చెందిన లక్షణ (10)పై నెల కిందట వీధి కుక్క దాడి చేసింది. దీంతో కుక్క గోళ్లు గీరి తలలో చిన్న గాయం అయింది. భయంతో చిన్నారి విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పలేదు.

అయితే మూడు రోజుల కిందట చిన్నారి కుక్కలాంటి అరుపులతో వింతగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలికకు తీవ్రమైన రేబిస్ వ్యాధి సోకినట్లు వైద్యులు గుర్తించారు. దీంతో మెరుగైన వైద్యం కోసం బాలికను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం బాలిక మృతి చెందింది.

# సీఎం రేవంత్ ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఖరారు



హైదరాబాద్, అక్టోబర్ 26
(తెలంగాణ ముచ్చట్లు)

సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఖరారైంది. అక్టోబర్ 28వ తేదీనగ బహిరంగ సభతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారాన్ని న రోడ్ షోతో ఆరంభించనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఆదివారం (అక్టోబర్ 26వ తేదీ) వెల్లడించారు. నాలుగు రోడ్ షోలు, ఒక బహిరంగ సభలో సీఎం రేవంత్ పాల్గొంటారని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ నెల 28వ తేదీన సీఎం రేవంత్ బహిరంగ సభకు ప్లాన్ చేసిన కాంగ్రెస్.. ఈ సభను పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఆపై అక్టోబర్ 30, 31, నవంబర్ 4,5 తేదీలలో సీఎం రోడ్ షో చేపట్టనున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. పలువురు సినీ ప్రముఖులు కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొననున్నారు.

# ఎన్నికల ప్రచారంలో కీలక నేతల మధ్య సమన్వయంపై సందేహాలు

- గెలిచినా ఓడినా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిదే బాధ్యత అన్నట్టుగా పరిస్థితి
- ఏపీ ప్రాంతంవారి ఓట్ల కోసం కమలం నేతల ప్రత్యేక వ్యూహాలు
- అంతర్గతంగా బీజేపీకి ఎన్డీయే మిత్రులు టీడీపీ, జనసేన మద్దతు

2లో



# తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు..
## పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ

హైదరాబాద్, అక్టోబర్ 26(తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాగల ఐదురోజుల పాటు రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ. మంగళశారం జయశంకర్ భూపాలపల్లి, కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

మిగతా 2లో..

# ఇంట్లో ఈగల మోత.. బయట పల్లకిల మోత..
## కాంగ్రెస్‌పై హరీశ్‌రావు సెటైర్లు

హైదరాబాద్, అక్టోబర్ 26(తెలంగాణ ముచ్చట్లు)

కాంగ్రెస్‌ది ఇంట్లో ఈగల మోతా.. బయట పల్లకిల మోతా అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పంపకాల్లో తేడా వచ్చి మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకుంటున్నారని అన్నారు. మొన్న కొండా సురేఖ బిడ్డ, నిన్న జూపల్లి కృష్ణారావు ఎలా మాట్లాడారో చూశారు కదా అని తెలిపారు. క్యాబినెట్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి, మంత్రులు బట్టలూడదీసుకొని తిట్టుకున్నారట అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజల గురించి చూడటం లేదని.. వాళ్లు తన్నుకోడానికి, వాటాలు పంచుకోవడానికి సరిపోతుందని విమర్శించారు.



మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# ఇబ్బందులు పోవాలంటే.. మన ప్రభుత్వం రావాలి : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉండే మీ బంధువులకు.. స్నేహితులకు నవంబర్ 11 నాడు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, పద్మారావు నగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ లు హేమలత, టీ మహేశ్వరి, సునీత, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, కొలన్ బాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన పలువురు నాయకులు, బస్తీవాసులు సత్యనారాయణ, సుభాష్, యాదగిరి, రవి, కుషాల్, వెంకటేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో కీలక నేతల మధ్య సమన్వయంపై సందేహాలు

హైదరాబాద్, అక్టోబర్26(తెలంగాణ ముచ్చట్లు)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం ఊపందుకుంది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, బీజేపీల మధ్య త్రిముఖ పోరు జరుగుతోంది. నామినేషన్ల పర్వం ముగియడంతో బరిలో నిలిచిన పార్టీలు, అభ్యర్థుల బలాబలాలు, ఇతర అంశాలు చర్చకు వస్తున్నాయి. వచ్చేనెల 11న పోలింగ్ జరగనుంది. ప్రచారానికి ఇంకా సమయం ఉండటంతో ఓటర్లను ఆకట్టుకునే వ్యూహాలకు అన్ని పార్టీలు పదును పెడుతున్నాయి. ఇలాంటి కీలక పరిస్థితుల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలంతా సమన్వయంతో కలిసి పనిచేస్తారా లేదా అన్నదే బీజేపీలో పెద్ద ప్రశ్నగా మారింది. పార్టీలో నాయకుల మధ్య సమన్వయం ఉందని చెప్పుకోవడానికి ఈ ఎన్నిక మంచి అవకాశంగా నాయకత్వం భావిస్తోంది.

ఎన్నికల ప్రచారంలో ముఖ్యనేతలు ఎక్కువ సంఖ్యలోనే పాల్గొంటున్నా.. ఇదంతా ప్రణాళికాబద్ధంగా జరుగుతుందా లేదా అన్న సందేహాలు పార్టీ నాయకుల్లో వ్యక్తమౌతున్నాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉండడంతో ఇక్కడ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునే భారమంతా ఆయనపైనే పడుతోంది. పార్టీ గెలిచినా ఓడినా బాధ్యత అంతా కిషన్‌రెడ్డిదే అనే ప్రచారం పార్టీలో సాగుతోంది. దీంతో కిషన్‌రెడ్డి ఈ ఎన్నికను సవాల్‌గా తీసుకున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం కిషన్‌రెడ్డి మార్గదర్శనంలోనే ఎన్నికల ప్రచారం జరుగుతోంది. కొన్ని నెలలుగా కిషన్‌రెడ్డి ఈ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో పాటు పలు కార్యక్రమాలను ఇక్కడి నుంచే ప్రారంభించారు. డివిజన్లవారీగా ఇన్‌చార్జిలను నియమించి ప్రచారం చేపడుతున్నారు. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన లంకల దీపక్‌రెడ్డికి 25 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో కూడా ఆయనకే పార్టీ టికెట్ ఇవ్వటంతో ఈసారి కచ్చితంగా మెరుగైన ప్రదర్శన చూపడంతోపాటు గెలుపు వాకిట నిలిచే అవకాశాలు కొట్టిపారేయలేమని కమలం నేతలు అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల ఇమేజ్.. నియోజకవర్గంలో దీపక్‌రెడ్డికి ఉన్న పరిచయాలను బేరీజు వేస్తే బీజేపీ గెలుపు కష్టమేమీ కాదన్న ఆశాభావంతో ఆ పార్టీ నేతలున్నారు.

ఈ నియోజకవర్గ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందినవారి ఓట్లు కూడా గణనీయంగా ఉండడంతో ఆ ఓట్లపై కన్నేసినట్టు పార్టీ వర్గాల సమాచారం. పార్టీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీఎన్‌వీ మాధవ్, మాజీ అధ్యక్షురాలు పురంధేశ్వరి, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి తదితరులున్నారు. వీరి ద్వారా ఆంధ్ర ప్రాంత ఓటర్లను ఆకర్షించేలా ప్రత్యేక ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. వారి ఓట్లను వేయించుకోగలిగితే విజయావకాశాలు మెరుగవుతాయనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఈ దిశలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి.

వివిధ కులాలు, వర్గాల ముఖ్యనేతలు, సంఘాలు, ప్రభావం చూపే వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. తమ పార్టీల్లోని ఆయా సామాజికవర్గాల ముఖ్యనేతల ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. గతంలో ఇక్కడ టీడీపీ ప్రాబల్యం ఉండగా... ఇప్పుడు ఆ పార్టీ పోటీలో లేకపోవడంతో టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్ల కోసం బీజేపీ ప్రయత్నాలు తీవ్రతరం చేసింది. బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తోందని పైకి చెబుతున్నా.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేనలు బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చే అవకాశాలు లేకపోలేదనే ప్రచారం జరుగుతోంది.

# నౌకా నిర్మాణంలో 'మనం ఎక్కడ?'

చైనా ప్రణాళికాబద్ధంగా నౌకా నిర్మాణంలో విస్తరిస్తుంటే మన దేశం మాత్రం మీనమేషాలు లెక్కిస్తూ ఉండిపోయింది. మూడు వైపులా సముద్రం ఉన్న ద్వీపకల్పం కావడంతో పాటు హిందూ మహాసముద్రంలో అత్యంత కీలక స్థానంలో ఉన్నప్పటికీ నౌకా నిర్మాణంలో, అంతర్జాతీయ నౌకా వాణిజ్యంలో క్రియాశీలక పాత్ర పోషించాలనే దిశగా భారత్ అడుగులు వేయలేకపోయింది. ఈ నిర్లక్ష్యం ఖరీదు ఎంతో చెప్పనలవి కాదు. దాదాపు 4 లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ, టాప్5 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన మనదేశం ఏటా పెద్దవిత్తున సరకుల ఎగుమతులు, దిగుమతులు చేస్తోంది. సాధారణంగా అయితే ఈ సరకులు మనదేశానికి చెందిన నౌకల్లో రవాణా కావాలి. కానీ దానికి పూర్తి భిన్నంగా 99 శాతం విదేశీ నౌకల మీదే మన అంతర్జాతీయ వాణిజ్యం కొనసాగుతోంది. ఇందుకోసం ఏటా 75 బిలియన్ డాలర్ల ఛార్జీలను విదేశీ సంస్థలకు చెల్లించాల్సి వస్తోంది. ఈ మొత్తం దాదాపు మన రక్షణ బడ్జెట్‌కు సరిసమానం. నౌకా నిర్మాణం రూపేణ పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, స్వయం సమృద్ధి సాధించే అవకాశం ఉన్నప్పటికీ ఈ రంగంపై ప్రభుత్వం,ప్రైవేటు రంగ పరిశ్రమలు దృష్టి సారించలేదు. కేంద్ర ప్రభుత్వం గత నెలలో నౌకా నిర్మాణ పరిశ్రమ విస్తరణ కోసం రూ.69,725 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన తర్వాత ఈ రంగ ప్రాధాన్యం తెరమీదకు వచ్చింది.



## చైనాదే పెత్తనం...!

ప్రపంచ వ్యాప్తంగా నౌకా నిర్మాణ పరిశ్రమలో చైనా తిరుగులేని స్థానంలో ఉంది. దాదాపు 50% వాటా చైనాదే. 2024లో చైనా 33 ఎంజీటీ (మిలియన్ గ్రాస్ టన్నేజ్) నౌకలను నిర్మించింది. రెండో స్థానంలో 18 ఎంజీటీతో దక్షిణ కొరియా, మూడో స్థానంలో 10 ఎంజీటీతో జపాన్ ఉన్నాయి.

ఈ జాబితాలో మనదేశానిది 16వ స్థానం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ, ఇతర విధానపరమైన మార్పుల ద్వారా 2030 నాటికి టాప్10 జాబితాలో స్థానం సంపాదించాలనే లక్ష్యాన్ని మనదేశం నిర్దేశించుకుంది.

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం చూస్తే మనదేశంలో నౌకా నిర్మాణ పరిశ్రమ నామమాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా 65 ఎంజీటీ సామర్థ్యం ఉండగా, మనదేశంలో ఉన్న నౌకా నిర్మాణ సామర్థ్యం 1 ఎంజీటీ లోపే. ప్రభుత్వ రంగంలో కొచ్చిన్ షిప్‌యార్డ్, మఝగావ్ డాక్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, గోవా షిప్ యార్డ్ నౌకలు నిర్మిస్తున్నాయి. ప్రైవేటు రంగంలో ఎల్ అండ్ టీ షిప్‌బిల్డింగ్, ఏబీజీ షిప్‌యార్డ్, భారతీ షిప్‌యార్డ్, మరికొన్ని సంస్థలు ఉన్నాయి. ప్రభుత్వ సంస్థలతో పాటు ఎల్ అండ్ టీ షిప్‌బిల్డింగ్ ఒక్కటే కొంత క్రియాశీలంగా ఉంది. కానీ ఇవి నిర్మించే నౌకలు చిన్నవి. అంతర్జాతీయ వాణిజ్యానికి అనువైన నౌకా నిర్మాణం మనదేశంలో దాదాపుగా లేదనే చెప్పాలి. నిర్మాణ ఖర్చులు, సమయం ఎంతో ఎక్కువగా ఉండటం ప్రధాన అవరోధంగా ఉంది. డిజైన్, సాంకేతిక విషయాల్లోనూ వెనుకబాటే. అంతర్జాతీయ విపణిలో ఉన్న అవకాశాలను దేశీయ పరిశ్రమ అందుకోలేకపోయింది.

## ఇకనైనా మేల్కొనాలి

2047 నాటికి ప్రపంచంలో మూడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఒకటి కావాలని మనదేశం కలలు కంటోంది. నౌకా నిర్మాణం, అంతర్జాతీయ సరకు రవాణా రంగాల్లో అధిక వాటా లేకుండా దాన్ని సాధించలేం. ఆర్థిక వ్యవస్థ విస్తరించే కొద్దీ సరకుల ఎగుమతులు, దిగుమతులు ఎంతో పెరుగుతాయి. వాటిని తరలించేందుకు నౌకలు నిర్మించటం, నౌకా రవాణా సంస్థలను నిర్వహించటం అనేది అతిపెద్ద వ్యాపారావకాశం. విదేశీ సంస్థల మీద ఆధారపడే పనిలేకుండా, స్వయం సమృద్ధి సాధించినట్లు అవుతుంది. ఈ అంశాన్ని ఇటీవలే కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. దీనికి అనుగుణంగా పెద్ద ప్యాకేజీ ప్రకటించింది. నౌకా నిర్మాణ సంస్థల అవసరాలకు నిధులు సమకూర్చటం, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయటం, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు సాధించటం లక్ష్యంగా దీన్ని రూపొందించారు. నౌకా నిర్మాణ రంగానికి కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల రంగం హోదా కల్పించింది. ఫలితంగా మనదేశంలో నౌకా నిర్మాణ సామర్థ్యం 4.5 జీఎంటీలకు పెరుగుతుందని, 4 లక్షల కోట్ల డాలర్లకు పైగా పెట్టుబడులు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే 30 లక్షల కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. అన్నింటికీ మించి ఈ రంగంలో 'ఆత్మ నిర్భరత' సాధించినట్లు అవుతుంది.

# మరో స్లీపర్ బస్సులో మంటలు..ప్రయాణికులు సురక్షితం

హైదరాబాద్, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు)



ఆగ్రాలఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వేపై మరో ప్రైవేటు బస్సులో మంటలు చెలరేగాయి. దిల్లీ నుంచి లఖ్‌నవూ మీదుగా గోండా ప్రాంతానికి వెళ్తున్న ఏసీ స్లీపర్ బస్సులో రెవ్రి టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం మంటలు చెలరేగాయి. తెల్లవారుజామున 4:45 గంటల ప్రాంతంలో టోల్ ప్లాజాకు 500 మీటర్ల ముందు బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులందరినీ కిందకు దించేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని..మంటలు ఆర్పివేశారు. బస్సులో ఉన్న దాదాపు 39 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మొదట బస్సు చక్రంలో ప్రారంభమైన మంటలు వాహనంలోని మిగిలిన భాగాలకు వ్యాపించినట్లు డ్రైవర్ జగత్ సింగ్ తెలిపాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న ప్రైవేటు బస్సు యాజమాన్యం ప్రయాణికులకు మరోబస్సును ఏర్పాటు చేసింది. బస్సుకు మంటలు అంటుకోవడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ఇంట్లో ఈగల మోత.. బయట పల్లకిల మోత..

(మొదటి పేజీ తరువాయి)

మళ్లా కేసీఆర్ వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు.

తెలంగాణ భవన్ లో వడ్డెర సంఘం సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరిలాగా పైకి రావాలి.. మేలు జరగాలని మీరు కోరుకుంటున్నారని వడ్డెర కులస్తులను ఉద్దేశించి అన్నారు. నిజానికి కేసీఆర్ ప్రభుత్వం వడ్డెర సమాజానికి సహాయం చేసిందని తెలిపారు. సిద్దిపేటలో ట్రాక్టర్లు అందించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొరం కొట్టుకునే తమపై అక్రమ కేసులు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని వడ్డెర సోదరుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడు హైదరాబాద్‌లో బిల్డింగులు నిర్మించేవాళ్లకు, మీకు చేతినిండా కూడా పని దొరికేదని అన్నారు. కేసీఆర్ హైదరాబాద్‌లో లక్ష డబల్ బెడ్ రూమ్ ఇల్లులు కట్టిండని హరీశ్‌రావు అన్నారు. రేవంత్ రెడ్డి లక్ష ఇండ్లను కూలగొట్టిండని పేర్కొన్నారు. పేదల ఇండ్లు కూల్చొద్దంటే, హైడ్రా బందు కావాలంటే కాంగ్రెస్ ను ఓడకొట్టాలే అని విమర్శించారు. హైదరాబాద్‌లో ఇల్లులు కూలగొట్టినా ప్రజలు నాకే ఓటేసిర్రని రేవంత్ రెడ్డి విర్రవీగుతాడని చెప్పారు.

ఎన్నికల ముంగట మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని గ్యారెంటీ కార్డు ఇచ్చారని హరీశ్‌రావు అన్నారు. రెండువేల పెన్షన్ రూ.4000 చేస్తామన్నారని.. చేశారా కాంగ్రెస్ వాళ్లు అని ప్రశ్నించారు. 200 ఉన్న పెన్షన్ కేసీఆర్ 2000 చేసిండని చెప్పారు. 4000 పెన్షన్ ఇవ్వకపోయినా మహిళలకు 2500 ఈయకపోయినా నాకే ఓటేశారు అని రేవంత్ రెడ్డి అంటాడని తెలిపారు. మహిళలకు 2500 రావాలన్నా, వృద్ధులకు 4000 పెన్షన్ రావాలన్నా జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. ఓటుతో రేవంత్ రెడ్డి చెంపలు వాయించి బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి డబ్బు మూటలను, గుండాలను నమ్ముకున్నారని తెలిపారు.

# జేఎన్టీయూ వంతెనపై కారు బీభత్సం

హైదరాబాద్, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్‌లోని జేఎన్టీయూ వంతెనపై కారు బీభత్సం సృష్టించింది. ఆదివారం ఉదయం 7.50 గంటల సమయంలో రైతుబజార్ దాటి వంతెన ఎక్కిన కారు.. అతి వేగంతో తొలుత డివైడర్‌ను, ఆ తర్వాత ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నారు. యువకులను సూడాన్ దేశస్థులుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన తర్వాత యువతులు కారు దిగి మరో క్యాబ్ బుక్ చేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. బీభత్సం సృష్టించిన కారును అద్దెకు తీసుకున్నారా? ఎవరైనా ఇచ్చారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సూడాన్‌కు చెందిన యువకులు నగరంలో చదువుకుంటూ శంషాబాద్‌లో నివాసముంటున్నారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



# తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని అంచనా వేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

# కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం అవసరం






## సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

**చర్లపల్లి, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు)** కార్మిక వర్గ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేస్తూ పోరాటాలను ఉధృతం చేయడం తక్షణ కర్తవ్యం అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు.

సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాలుగో మహాసభలు ఆదివారం చర్లపల్లి సిఐఎ ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాల్ (కామ్రేడ్ ఆదిరెడ్డి నగర్)లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సీనియర్ నాయకుడు జె.రాఘవరావు సీఐటీయూ జెండాను ఆవిష్కరించగా, రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.తరువాత ప్రతినిధుల సమావేశంలో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ —"కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక వ్యతిరేక చర్యలను అమలు చేస్తోంది. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం వల్ల కార్మిక హక్కులు హరించబడుతున్నాయి. ఈ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోంది" అన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోరుతూ: ప్రభుత్వరంగ సంస్థలను బలహీనపరుస్తూ, వాటిని కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేస్తున్న కేంద్ర విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన అన్నారు. "ప్రభుత్వరంగ సంస్థలు కేవలం కార్మికుల ప్రయోజనాలకే కాకుండా ప్రజా సంక్షేమానికి కూడా ముఖ్యమైనవి. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక వాటాల విక్రయాలను వేగవంతం చేయడం దేశ ఆర్థిక స్వావలంబనకు ముప్పు" అని ఆయన పేర్కొన్నారు.సంక్షేమ పథకాలపై దెబ్బ: దేశవ్యాప్తంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామీణ ఉపాధి హామీ, ఆరోగ్యశ్రీ వంటి 63 సంక్షేమ పథకాల బడ్జెట్ తగ్గించడం వల్ల పేద ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. కేంద్రం ప్రైవేటీకరణకు దారితీస్తూ, పేదల సంక్షేమాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు.

కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలి: రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయ్మెంట్లలో కనీస వేతనాల సవరణ 12-18 ఏళ్లుగా జరగలేదని భాస్కర్ విమర్శించారు. పాత వీడిఎను కలిపి చూపి కొత్తగా పెంపు చేయలేదని అన్నారు. సుమారు కోటి 20 లక్షల కార్మికులు దీనిపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని సీఐటీయూ మహాసభ డిమాండ్ చేసింది.నూతన కమిటీ ఎన్నుకున్న సీఐటీయూ:మహాసభలో గత మూడు సంవత్సరాల పనితీరుపై ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్ నివేదిక సమర్పించారు. అనంతరం రంగాలవారీ చర్చలు జరిపి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు: అధ్యక్షుడు: జె.చంద్రశేఖర్

ఉపాధ్యక్షులు: ఎన్.శ్రీనివాస్, బి.వి.సత్యనారాయణ, జె.వెంకన్న, డి.శోభరాణి,ప్రధాన కార్యదర్శి: ఎ.అశోక్,సహాయ కార్యదర్శులు: జి.శ్రీనివాసులు, ఉన్నికృష్ణ, ఐ.రాజశేఖర్, రేవతి కళ్యాణి, ఐ.రమేష్, లింగస్వామి,కోశాధికారి: పి.గణేష్.మహాసభలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



# నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

**సత్తుపల్లి, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రయాణికుల సమస్యలను ప్రత్యక్షంగా విని పరిష్కారం చూపే దిశగా ఆర్టీసీ తీసుకుంటున్న ప్రజాహిత చర్యల్లో భాగంగా సత్తుపల్లి డిపోలో 'డయల్ యువర్ డిపో మేనేజర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఊటుకూరి సునీత తెలిపారు. ఈ కార్యక్రమం నేడు (సోమవారం) సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు జరగనుందని చెప్పారు.

సత్తుపల్లి ఆర్టీసీ బస్సుల రాకపోకలు, టైమింగులు, సీటింగ్, బస్సుల శుభ్రత, సిబ్బంది ప్రవర్తన, రద్దీ, పర్సులు/లగేజీ సమస్యలు వంటి ఏదైనా అంశంపై ప్రయాణికులు తమ ఫిర్యాదులు, సూచనలు, సమస్యలు, అభిప్రాయాలు నేరుగా చెప్పవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చే సూచనలు సేవల మెరుగుదలకు ఎంతో తోడ్పడతాయని చెప్పారు. ప్రయాణికులు 9959225962 నంబర్‌కు ఫోన్ చేసి నేరుగా మాట్లాడవచ్చని తెలిపారు.

ప్రజా సేవలను మరింత బలోపేతం చేయడానికి ప్రజల భాగస్వామ్యం అవసరం కాబట్టి సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రతి ప్రయాణికుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# మేడ్చల్ మల్కాజిగిరి సిఐటియు నాలుగో మహాసభలు

**నాచారం నుండి ముగ్గురు నాయకులకు జిల్లా కమిటీలో స్థానం కోశాధికారిగా పి.గణేష్**



**నాచారం, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సిఐటియు నాలుగో మహాసభలు చర్లపల్లి పారిశ్రామిక వాడలోని సిఐఏ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీని ప్రకటించారు.నాచారం ఏరియాకు ఈసారి ప్రాధాన్యం లభించింది. నాచారం ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. గణేష్ మేడ్చల్ జిల్లా సిఐటియు కోశాధికారిగా ఎన్నికయ్యారు. అలాగే పి. ప్రభాకర్, ఈ. రమేష్ లు జిల్లా కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ — కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రభుత్వ వ్యతిరేక కార్మిక విధానాలకు గట్టి ప్రతిఘటన ఇచ్చే దిశగా పనిచేస్తామని తెలిపారు. సిఐటియు బలోపేతం కోసం పారిశ్రామిక కార్మికుల ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



# కళాకారుణ్ణి సన్మానించిన తాటికాయల మాదిగ కుల సంఘం పెద్దలు

**జానపద గీతంతో ప్రజల మనసులు గెలుచుకున్న కళాకారుడు మహేందర్**

**ధర్మసాగర్,అక్టోబర్26(తెలంగాణ ముచ్చట్లు):** సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ సమీపంలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన జానపద కళాకారుడు మంద మహేందర్ తన స్ఫూర్తిదాయక ప్రతిభతో మరోసారి ప్రజల మనసులను గెలుచుకున్నాడు.ఆదివారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన వృద్ధురాలు నల్ల మల్లమ్మ మృతి చెందగా, ఆమె అంత్యక్రియలకు హాజరైన మహేందర్ అంతిమయాత్రలో భాగంగా డప్పుచప్పులతో పాటలు పాడుతూ పాల్గొన్నాడు. ఆ సమయంలో ఆవిడ జీవితంపై, కుటుంబ సభ్యులపై క్షణాల్లోనే రాసిన జానపద గీతాన్ని అంతిమయాత్రలో ఆలపించాడు. ఆ గీతం విన్న గ్రామస్థులు కదిలిపోయారు.

తన హృదయాన్ని తాకే ప్రదర్శనకు మంత్రముగ్ధులైన గ్రామస్థులు, ఎస్సీ కుల సంఘ పెద్దలు మహేందర్‌కు శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో దళితరత్న అవార్డు గ్రహీత,మాదిగ జర్నలిస్టు ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లెపాక రాజేష్, మాదిగ కుల సంఘం అధ్యక్షులు బొల్లెపాక నగేష్,ఉపాధ్యక్షులు పట్ల రాజమౌళి,కుల పెద్దలు ఎర్ర వెంకటస్వామి,బొల్లెపాక నర్సయ్య, ఎర్ర అశోక్, పట్ల నర్సయ్య,పట్ల రమేష్, బొల్లెపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన రాకేష్ కిషోర్ అరెస్టు చేయాలి





**వనపర్తి,అక్టోబర్26(తెలంగాణ ముచ్చట్లు):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ.. ఆదివారం పెద్దమందడి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం దగ్గర మాదిగ యువకులతో కొమ్ము విష్ణు మాదిగ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వెంకట్ రాములు మాదిగ మండల కన్వీనర్ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్న కేశవులు మాదిగ హాజరై, దళితులు ఉన్నత స్థానంలో కూర్చోవడం కొంతమంది అగ్ర కుల వారికి ఇష్టం లేక, చీఫ్ జస్టిస్ పై దాడికి పాల్పడినట్లు వ్యాఖ్యానించారు. ఈ దాడిని వ్యక్తిగతంగా కాకుండా, యావత్తు న్యాయ వ్యవస్థపై, దళిత సమాజంపై, అంతేకాక భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. మాజీ అధికారులు, ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, వెంటనే కేంద్ర ప్రభుత్వం రాకేష్ కిషోర్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక, నవంబర్ 1న హైదరాబాద్‌లో జరగనున్న దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనలో ప్రతి మండలం, గ్రామం, ప్రతి కళాశాల హాస్టల్ నుండి విద్యార్థులు, యువకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన నాయకత్వం పిలుపునిచ్చింది. సమావేశంలో పెద్దమందడి గ్రామ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా సింగిరెడ్డి మహేష్‌మాదిగను నియమించారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి కురుమూర్తి, కె. బ్రహ్మం మాదిగ, సింగిరెడ్డి ఆంజనేయులు మాదిగ, కె. రాజు మాదిగ, కె. సాయిబు మాదిగ, ఆనంద్ మాదిగ, పి నిరంజన్ మాదిగ, నాగరాజు మాదిగ, ఆంజనేయులు మాదిగ, శివ మాదిగ, కె. ఆంజనేయులు మాదిగ, మహేష్ మాదిగ, వినోద్ మాదిగ, ఇతర వి హెచ్ పి ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర నాలుగవ మహాసభల విజయవంతం కోసం పి.డి.ఎస్.యూ పిలుపు

**◆ పి.డి.ఎస్.యూ ప్రధాన కార్యదర్శి సాంబ**



**వనపర్తి,అక్టోబర్26(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం విద్యార్థులందరినీ వేలాదిగా రాష్ట్ర నాలుగవ మహాసభల విజయవంతం కోసం తరలిరావాలని పిలుపునిచ్చింది.

ఆదివారం వనపర్తి నాగవరం రోడ్డులోని సితార గ్రాండ్ హాల్ లో జరిగిన విలేకరుల సమావేశంలో పి.డి.ఎస్.యూ జాతీయ నాయకులు విజయ్ కన్నా, రాష్ట్ర అధ్యక్షుడు ఎం. వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏ. సాంబ మాట్లాడారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో రాష్ట్ర నాలుగవ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. విద్యారంగంలో జరుగుతున్న విద్యార్థి వ్యతిరేక మార్పులపై మేధావులతో చర్చించి, భవిష్యత్తు విద్యార్థి ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను ఈ మహాసభల ద్వారా ప్రకటించనున్నామని పేర్కొన్నారు.

జాతీయ నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పాఠ్య ప్రణాళిక దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో అసమానతలను పెంచుతోందని, సమానత్వ భావనతో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే విద్యా విధానం అవసరమని అన్నారు.

ఈ మహాసభల్లో ప్రధాన వక్తలుగా పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ఎం. రాఘవాచారి, కేంద్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ హరగోపాల్, కేంద్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ శ్రీ కాసిం, న్యాయవాది కుర్ర జితేందర్ బాబు, పి.డి.ఎస్.యూ జాతీయ సమన్వయకర్త ఎం. రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి ఆరెల్లి కృష్ణ తదితరులు ప్రసంగించనున్నారని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హైదరాబాద్ ఐటీ ఉద్యోగుల భారీగా బిఆర్ఎస్‌లో చేరిక





**హైదరాబాద్, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం రోజున ఐటీ ఉద్యోగులు భారీగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వివిధ కాలనీలకు చెందిన వందలాది మంది ఐటీ ప్రొఫెషనల్స్ ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ కండువాలు కప్పించుకున్నారు.ఈ సందర్భంగా ఐటీ ఉద్యోగులు మాట్లాడుతూ — గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో హైదరాబాదును "సేఫ్ సిటీ"గా తీర్చిదిద్దడంలో, ఆధునిక ఐటీ పాలసీల రూపకల్పనలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన నాయకత్వంలో అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు నగరానికి వచ్చి, వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో విద్యుత్ కోతలు, లా అండ్ ఆర్డర్ లోపం, షీ టీమ్ వ్యవస్థ బలహీనత వంటివి నగరాన్ని ఇబ్బందుల్లోకి నెట్టాయని పేర్కొన్నారు. మళ్లీ హైదరాబాదును ఐటీ హబ్‌గా నిలబెట్టేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి రావడం అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కొత్తగా పార్టీలో చేరిన ఐటీ ఉద్యోగులకు బిఆర్ఎస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జేఎసి వెంకన్న, మురుగేష్, మేకల రాము యాదవ్, హేమంత్ పటేల్, అప్పు ఖాన్, నారాయణ, బాబు రావు, వెంకటేష్, అనిత, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.పార్టీలో చేరిన ఐటీ ఉద్యోగుల్లో అర్చన, శివా ప్రకాష్, వంశీ, కార్తీక్, వెంకటేష్, వర్మ, వైష్ణవి, రోహిత్, పవన్, వివేక్, సాయి గౌడు, మోహన్, సందీప్, అజయ్, సంతోష్, వెంకటరమణ, కార్తీక్ బండి, గౌడ్, దిలీప్, సూర్య, మైత్రేష్ తదితరులు ఉన్నారు.

# సత్తుపల్లిలో మెగా ఉద్యోగ మేళా ఘనవిజయం





## 4,611 మందికి నియామక పత్రాలు

**సత్తుపల్లి, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని రాణి సెలబ్రేషన్స్ ప్రాంగణంలో చరిత్ర సృష్టించేలా "మెగా ఉద్యోగ మేళా" ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.
మొత్తం 14,300 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొన్నారు. వారిలో 4,611 మందికి వివిధ సంస్థల ద్వారా అక్కడిక్కడే నియామక పత్రాలు అందజేయబడ్డాయి. ఆన్‌లైన్ ద్వారా 11,500 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 2,818 మంది ముందుగా నమోదు చేసుకున్నారు. మొత్తం 72 సంస్థలు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొన్నాయి. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధుల సమక్షంలో వెంటనే నియామక పత్రాలు అందించడం జరిగింది. ఈ మేళా సింగరేణి సంస్థ మరియు టాస్క్ (టాస్క్) సంస్థ సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది. మేళాలో పాల్గొన్న సంస్థల మానవ వనరుల (హెచ్.ఆర్) ప్రతినిధులు, సింగరేణి ఉద్యోగ సిబ్బంది అందరిని సన్మానించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ, ప్రతి నిరుద్యోగికి ఒకేసారి అవకాశం రావడం కొంత కష్టమై ఉండొచ్చు కాబట్టి నిరుత్సాహపడవద్దని, భవిష్యత్తులో జాబ్ మేళాలను నిరంతర ప్రక్రియగా కొనసాగించనుండగా, సత్తుపల్లిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి నిపుణులైన ప్రొఫెషనల్ ట్రైనర్లు వచ్చి యువతకు వ్యక్తిగతంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ జాబ్ మేళా స్థానిక యువతకు భవిష్యత్తులో బంగారు అవకాశాలను సృష్టించడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలు త్రైమాసిక ప్రాతిపదికన నిర్వహించబడతాయని, అలాగే భవిష్యత్తులో మరిన్ని కంపెనీలను ఆహ్వానించి ఉద్యోగ అవకాశాలను విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి, సింగరేణి ప్రధాన అధికారి సాలెం రాజు, ప్రాజెక్ట్ అధికారి ప్రహ్లాద్, ప్రాజెక్ట్ అధికారి నరసింహరావు, టాస్క్ సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, ఏఎంసీ చైర్మన్‌లు, ఐదు మండలాల కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, లయన్స్ క్లబ్ సభ్యులు, సత్తుపల్లి ప్రముఖులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని కదిలించిన కర్నూల్ బస్సు ప్రమాదం



## దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి

**పెద్దమందడి, అక్టోబర్26(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు జిల్లా చిన్న టేకూరు గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం మానవత్వాన్ని కదిలించిందని, రోడ్డు ప్రమాదం పట్ల వెలటూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్. జగదీశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
ఈ ప్రమాదంలో 19 మంది సజీవ దహనం కావడం హృదయవిదారకమని ఆయన అన్నారు. ప్రభుత్వ అధికారులు వేగంగా స్పందించి హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేయడం, బాధిత కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమని తెలిపారు.
ప్రైవేట్ ట్రావెల్స్ యజమానుల నిర్లక్ష్యం కారణమై ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.
మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను, అని జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.
ప్రతిరోజూ జీవిత అవసరాల కోసం బయటకు వెళ్లి తిరిగి వస్తామన్న నమ్మకం కూడా లేకుండా ప్రజలు భయంతో జీవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కమిషన్ల ఆశతో, రాజకీయ పలుకుబడితో అనుమతులు ఇస్తుండటం, పిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై తిరగడం వంటివి ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు.
బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఒక కుటుంబ సభ్యునికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం జీవోలకు మాత్రమే పరిమితం కాకుండా, ఆచరణలో గట్టి చర్యలు తీసుకోవాలని ఆర్. జగదీశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# వనపర్తి జిల్లా సాగర ఉద్యోగుల సంక్షేమ సంఘం ఘన సన్మాన సభ



**వనపర్తి,అక్టోబర్26(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా సాగర ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆదివారం ఘనంగా అభినందన సన్మాన సభను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న, రిటైర్మెంట్ అయిన, పదోన్నతి పొందిన, అవార్డులు పొందిన, అలాగే 2023 నుండి కొత్తగా ఉద్యోగం చేరిన సాగర ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున జిల్లా ఉద్యోగులు, స్థానిక నాయకులు మరియు మద్దతుదారులు హాజరయ్యారు.
సభలో సాగర రాష్ట్ర సంఘం అధ్యక్షులు శేఖర సాగర, జిల్లా అధ్యక్షులు తిరుపతయ్య సాగర, జిల్లా ఉద్యోగ సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొని, ఉద్యోగుల సేవలను గుర్తించి, వారి ప్రతిభను ప్రశంసిస్తూ ఘనంగా సన్మానించారు. వారు, ప్రజలకు, ప్రభుత్వానికి నిబద్ధతతో పని చేసిన ఉద్యోగులను గుర్తించడం ఎంతో ఆనందం కలిగించే విషయం అని తెలిపారు.
2023-2024 పోలీస్ శాఖలో ప్రశంస పత్రం పొందిన ఆస్కానీ బాలరాజు ను సాగర సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఆస్కానీ బాలరాజు సన్మానానికి సంబంధించి మాట్లాడుతూ.. మాకు చేసిన సేవలను గుర్తించి, సన్మానించడం చాలా సంతోషంగా ఉంది. ఇది మాకు మరింత ప్రోత్సాహం కలిగిస్తుంది అని తెలిపారు.

# బిఆర్ఎస్ యువ నేత తిరుమల్ రావు ప్రథమ వర్ధంతి




**నాచారం, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** బిఆర్ఎస్ పార్టీ దివంగత యువ నేత తిరుమల్ రావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆదివారం రోజు వి.ఎస్.టి కాలనీలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ పాల్గొని తిరుమల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ కోసం తిరుమల్ చేసిన కృషి మరువలేనిదని, ఆయన లేని లోటు కుటుంబానికే కాకుండా పార్టీకి కూడా తీరనిదని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వాసు, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, సాయి తదితరులు పాల్గొని దివంగత నేతకు నివాళులర్పించారు.

# ఈ నెల 30న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్

**సత్తుపల్లి, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సత్తుపల్లి డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం పెనుబల్లి మండల కేంద్రంలోని చలమల సూర్యనారాయణ భవనంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే విద్యా సంస్థల బంద్‌ను ప్రతి విద్యార్థి విజయవంతం చేయాలి. పేద విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. విద్యార్థుల జీవితాలతో ఆటలాడే ప్రభుత్వాన్ని ప్రశ్నించే సమయం వచ్చింది, అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. కానీ ఇప్పటివరకు వాటిలో ఒక్కదానినీ అమలు చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 8,150 కోట్ల రూపాయల స్కాలర్షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పరిస్థితి కారణంగా పేద విద్యార్థులు తమ చదువును కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, అని పేర్కొంటూ "పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను వెంటనే విడుదల చేయాలి. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ముమ్మరం చేయక తప్పదు. ఈసారి విద్యార్థుల ఆగ్రహాన్ని ప్రభుత్వం తేలికగా తీసుకోరాదు," అని హెచ్చరించారు. పలు ప్రభుత్వ మరియు ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు సర్టిఫికెట్లు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యా సంస్థలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఈ పరిస్థితి పేద విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థి ప్రతినిధులు, డివిజన్ స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.



## వెల్టూర్ గ్రామ వడ్డెర సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

**వడ్డెర సంఘం మండల నాయకులు వడ్డే శేఖర్**

**పెద్దమందడి,అక్టోబర్26(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామ వడ్డెర సంఘం నూతన కమిటీని ఆదివారం మండల నాయకులు వడ్డే శేఖర్, బాలయ్య ఆధ్వర్యంలో ఏకీగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వడ్డె శేఖర్ తెలిపారు.వెల్టూర్ గ్రామ వడ్డెర సంఘం అధ్యక్షుడిగా కుంచపు చంద్రాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ముద్దంగుల శివకుమార్, ముద్దంగుల సత్యనారాయణ, ముద్దంగుల బాలరాజులు ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ముద్దంగుల బాల నాగన్న, గౌరవ అధ్యక్షుడిగా ముద్దంగుల నాగరాజ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులుగా ముద్దంగుల శేఖర్, ఆంజనేయులు, లక్ష్మయ్య, కోశాధికారిగా ముద్దంగుల రమేష్, ప్రచార కార్యదర్శిగా ముద్దంగుల మన్యంకొండ, కార్యనిర్వాహక సభ్యులుగా ముద్దంగుల ఆంజనేయులు, ఆశన్న ఎన్నికయ్యారు. మహిళా కన్వీనర్గా ముద్దంగుల సునీత, సహాయ కన్వీనర్లుగా లక్ష్మి, శిరీషలు బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కొత్త కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. వడ్డెర సంఘం ఐక్యత, అభివృద్ధి, యువతలో చైతన్యం పెంపు కోసం కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలోని వడ్డెర యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి జరపటి ఈశ్వర్,జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు దాసర్ల భూమయ్య, జయశంకర్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో వడ్డెర సంఘం బలపడడం ఆనందకరమని, సమాజ అభివృద్ధి కోసం సభ్యులంతా కలసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి జరపటి ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య, గౌరవ అధ్యక్షులు దాసర్ల బాలరాజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, జిల్లా ప్రచార కార్యదర్శి ఈశ్వర్, పీట్ల జయశంకర్, మండల అధ్యక్షులు మణిగిల్ల వెంకటేష్, మండల నాయకులు వడ్డే శేఖర్, బీచుపల్లి, నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





## ప్రమాదవశాత్తు లారీ కిందపడి మహిళ మృతి

**సత్తుపల్లి, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణ శివారులో ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం, సత్తుపల్లి పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ రోడ్డుకు చెందిన మోరంపూడి స్వర్ణలత (55) టూవీలర్పై గంగారం నుండి సత్తుపల్లి వైపు వస్తుండగా, రోడ్డుపై అకస్మాత్తుగా కుక్కలు అడ్డంకిగా రావడంతో బ్యాలెన్స్ కోల్పోయి రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీ వెనుక భాగానికి బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ వెనుక బంపర్కు తగలడంతో స్వర్ణలత అక్కడికక్కడే మృతి చెందింది.సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే మహిళ మరణించడంతో, లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని 108 వాహనంలో ఉన్న ప్రత్యేక పరికరాలతో బయటకు తీశారు. తదుపరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## వెంకయ్య నాయుడు చేతులమీదుగా ఆలపాటికి రైతు నేస్తం అవార్డు

**అశ్వారావుపేట, అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతులమీదుగా తెలంగాణ ఆయిల్ ఫామ్ రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ కు రైతు నేస్తం అవార్డు అందజేయడం జరిగింది. ఈ అవార్డు ఆహ్వానితులు పలు రంగాల్లో ఉత్తమంగా ప్రతిభ చూపిన రైతులకు ప్రదానం చేయబడినది.

ఆదివారం శంషాబాద్ సమీపంలోని స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, పలు రాష్ట్రాల నుండి ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, అశ్వరావుపేట, సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన పామాయిల్ రైతులు, అలాగే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.

ఈ అవార్డుకు ఎంపిక చేయబడిన ఆలపాటి రామచంద్ర ప్రసాద్, రైతుల సంక్షేమం, ఆయిల్ ఫామ్ రంగంలో అందించిన సేవలకు గుర్తింపు లభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోత్సవం ద్వారా ఇతర రైతులకు కూడా ప్రేరణ కల్పించబడింది.

# రాజ్యాంగ హక్కుల సాధన కోసం చలో ఢిల్లీ కరపత్ర ఆవిష్కరణ

**మేడ్చల్ , అక్టోబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి చేతుల మీదుగా "చలో ఢిల్లీ" రాజ్యాంగ హక్కుల సాధన సభకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని జాతీయ మాల మహానాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం, ఉపాధ్యక్షులు పడిగం ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా మలిపెద్ది సుధీర్ రెడ్డి, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సమూహ భాద్యతని తెలిపారు. కార్యక్రమంలో దమ్మాయిగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పా రామారావు, నాగారం పట్టణ కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కీసర మండల అధ్యక్షులు



కోలా కృష్ణ యాదవ్, దమ్మాయిగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు అరిగే నాగరాజు, అర్జికే కాలనీ మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాటా రాజు, ప్రధాన కార్యదర్శి సనాధి సాయిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ దుబాయ్ రాజు, సీనియర్ నాయకులు దిలీప్, మోతె రాజేంద్ర ప్రసాద్ మరియు యువ నాయకులు ప్రవీణ్, కేవీ ఆర్ తదితరులు పాల్గొన్నారు.నవంబర్ 26న జరగనున్న రాజ్యాంగ హక్కుల సాధన సభకు ఇది ప్రీఇవెంట్ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం.

# మారుతున్న కుటుంబ వ్యవస్థలు మరియు వ్యక్తివాదం పెరుగుదల

భారతీయ సంస్కృతి శతాబ్దాలుగా కుటుంబ బంధాలపై ఆధారపడి నిలిచింది. సంయుక్త కుటుంబం అనే వ్యవస్థ కేవలం జీవన విధానం కాదు, అది విలువలతో, సాంస్కృతిక పరంపరలతో కూడిన జీవన పాఠశాల. పితామహుడు, పితామహి, తల్లిదండ్రులు, పిల్లలు, మనవళ్లు ఈ తరాల సమాహారం సామాజిక స్థిరత్వానికి మూలాధారం. ఒకరికొకరు ఆధారం, సాయం, సానుభూతి ఇవన్నీ సంయుక్త కుటుంబ జీవనంలో సహజ లక్షణాలుగా కనిపించేవి. కానీ ఆధునిక యుగంలో ఈ వ్యవస్థ శీఘ్రంగా మారిపోతోంది. పట్టణీకరణ, విద్య, వృత్తి అవకాశాలు, సాంకేతిక అభివృద్ధి ు ఇవన్నీ కుటుంబాలను చిన్నచిన్న యూనిట్లుగా విభజించాయి. ఇప్పుడు న్యూక్లియర్ ఫ్యామిలీ అనే పదం భారతీయ సమాజంలో కొత్త సర్వసాధారణంగా మారింది. ఈ మార్పుకు కారణాలు అనేకం ఉన్నప్పటికీ, ప్రధానమైనది ఆర్థిక స్వాతంత్ర్యం మరియు వ్యక్తిగత ఆశయాలు. విద్యావంతులైన యువత ఉద్యోగాల కోసం పట్టణాలు, విదేశాలు చేరుతున్నారు. తల్లిదండ్రుల నుంచి వేరుగా నివసించడం తప్పనిసరైపోతోంది. ఇదే సమయంలో మహిళలు కూడా విద్య, ఉద్యోగాల ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధిస్తున్నారు. ఫలితంగా కుటుంబ నిర్ణయాలు ఇప్పుడు ఒకరిపై ఆధారపడేవి కాకుండా, పరస్పర చర్చలపై ఆధారపడుతున్నాయి. ఇది సమానత్వం వైపు దారి తీసినప్పటికీ, కుటుంబ సమయానికి, పరస్పర భావోద్వేగానికి తక్కువ ప్రాధాన్యం రావడం గమనార్హం. ఇద్దరి కెరీర్ ఒత్తిడులు, వేగవంతమైన నగరజీవనం, డిజిటల్ డిస్ట్రాక్షన్స్ ు ఇవన్నీ కలిపి కుటుంబ సంభాషణలను నెమ్మదిగా మింగేస్తున్నాయి.

వ్యక్తివాదం ఈ సమాజ మార్పులో ప్రధాన భూమిక పోషిస్తోంది. "నా జీవితం నా నియంత్రణలో ఉండాలి" అనే భావన ఆధునిక తరానికి బలమైన సూత్రంగా మారింది. వ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తిగత అభిరుచి, స్వయం నిర్ణయం ు ఇవన్నీ సమాజంలో కొత్త విలువలుగా స్థిరపడ్డాయి. ఇది ఒకవైపు వ్యక్తి అభివృద్ధికి దోహదం చేస్తే, మరోవైపు సామాజిక సమిష్టి భావనను సవాలు చేస్తోంది. ఒకప్పుడు "మన కుటుంబం" అన్న భావన బలంగా ఉండేదిబీ ఇప్పుడు "నేను" అన్న భావన ప్రధాన స్థానాన్ని దక్కించుకుంది. ఈ మార్పు సహజమైనదే అయినప్పటికీ, దీని వల్ల మానవ సంబంధాల లోతు తగ్గిపోతోందన్నది వాస్తవం.

ఈ వ్యక్తివాద జీవనశైలిలో వృద్ధుల పరిస్థితి అత్యంత సున్నితమైన అంశం. ఒకప్పుడు పెద్దవారు కుటుంబానికి దిక్సూచిలా ఉండేవారు. వారి అనుభవం, సలహాలు కుటుంబ నిర్ణయాల్లో కీలకమై ఉండేవి. కానీ ఇప్పుడు పెద్దల స్థానంలో సాంకేతిక పరిజ్ఞానం, ఆన్లైన్ సలహాలు వచ్చేశాయి. అనేక వృద్ధులు ఒంటరితనంలో జీవిస్తున్నారు. పిల్లలు విదేశాల్లో, ఉద్యోగాల కోసం ఇతర పట్టణాల్లో ఉండటం వల్ల వారితో సంభాషణలు తగ్గిపోతున్నాయి. ఇది కేవలం కుటుంబ సమస్య కాదు, సమాజంలోని మానవ విలువలు ఎలా మారుతున్నాయన్న దానికి ప్రతిబింబం. పిల్లల పెంపకంలో కూడా ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు పెద్దవారితో గడిపే సమయం పిల్లల విలువల రూపకల్పనలో కీలకమై ఉండేది. ఇప్పుడు ఆ పాత్రను గాడ్జెట్లు తీసుకున్నాయి. తల్లిదండ్రుల సమయాభావం, ఒత్తిడి కారణంగా పిల్లలు టెలివిజన్, మొబైల్, సోషల్ మీడియాతో ఎక్కువగా గడుపుతున్నారు. ఫలితంగా వ్యక్తిత్వ వికాసం కన్నా వినోదం, ప్రదర్శన, సాంకేతిక మోజు ప్రధానమవుతోంది. ఈ దిశగా వెళ్తున్న సమాజం తన సంస్కృతి, పండుగల ఉత్సాహం, ఆచారాల పరంపరను కూడా కోల్పోతున్నది.

అయితే వ్యక్తివాదం అంతా ప్రతికూలం కాదని గుర్తించాలి. ఇది వ్యక్తి ఆత్మవిశ్వాసాన్ని, స్వతంత్ర ఆలోచనను పెంపొందిస్తుంది. మహిళలు, యువత తమ నిర్ణయాలు తాము తీసుకోవడం సామాజిక సమానత్వానికి మార్గం చూపుతోంది. వ్యక్తివాదం వల్ల సమాజంలో కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకత, సామాజిక సంస్కరణలు పుడుతున్నాయి. కానీ అదే వ్యక్తివాదం కుటుంబ బంధాలను, సమాజ బలాన్ని దెబ్బతీయకూడదు. స్వేచ్ఛ, బాధ్యత రెండూ సమతుల్యంగా ఉండాలి.

ప్రస్తుత కాలంలో సాంకేతికత ఈ వ్యక్తివాదానికి బలమైన తోడ్పాటుగా నిలుస్తోంది. సోషల్ మీడియా మన సంబంధాల నిర్వచనాన్ని పూర్తిగా మార్చేసింది. ఒకప్పుడు కుటుంబం, స్నేహితులు, పొరుగు వాళ్లతో గడిపే సమయాన్ని ఇప్పుడు డిజిటల్ స్క్రీన్లు ఆక్రమించేశాయి. వాస్తవ జీవనంలో మనుషుల మధ్య దూరం పెరిగి, వర్చువల్ ప్రపంచంలో సమీపం పెరగడం అనేది విరుద్ధమైన వాస్తవం. ఈ మార్పు మన మానసిక ఆరోగ్యంపైనా, సామాజిక చైతన్యంపైనా ప్రభావం చూపుతోంది.

సమాజం అనేది వ్యక్తుల సమాహారం. ప్రతి వ్యక్తి స్వతంత్రంగా ఎదగడం అవసరం కానీ, అదే సమయంలో "మన" అనే భావన కాపాడుకోవడం మరింత ముఖ్యమైంది. కుటుంబం మనకు కేవలం రక్త సంబంధం కాదు. అది భావోద్వేగపు ఆశ్రయం. ఆధునికతను స్వీకరించేటప్పుడు విలువలను కోల్పోకపోవడం మన సమాజ స్థిరత్వానికి కీలకం. వ్యక్తివాదం మనకు దిశ చూపాలి గాని, దారితప్పించకూడదు. ఈ సమతుల్యతే నూతన భారత సమాజం నిలదొక్కుకునే బలం.

# ప్రకృతి వైపరీత్యమా లేక మానవ నిర్లక్ష్యమా?

ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చినప్పుడల్లా దేశంలోని ప్రధాన నగరాలు నీట మునిగిన దృశ్యాలను మనం చూస్తూనే ఉన్నాం. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలు వరదలతో అతలాకుతలం అవుతుండడం ఇక కొత్త విషయం కాదు. కానీ ప్రశ్న ఏమిటంటే ఇవన్నీ నిజంగా ప్రకృతి వైపరీత్యాలేనా? లేక మానవ అజాగ్రత్త, నిర్లక్ష్యం, అసంఘటిత పట్టణ ప్రణాళికల ఫలితమా? వాస్తవం ఏమిటంటే, నగర వరదలు ఇప్పుడు ప్రకృతికి కంటే మన వ్యవస్థల వైఫల్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

చెన్నై 2015 వరదలను ఎవరు మరచిపోతారు? కొన్ని రోజుల్లోనే రికార్డు స్థాయిలో వర్షం పడడంతో నగరం జలప్రళయాన్ని చూశింది. కానీ తర్వాతి పరిశోధనల్లో బయటపడిన నిజాలు ఒక్కటే చెబుతున్నాయి ు ఆ విపత్తుకు కారణం కేవలం వర్షపాతం కాదుబీ నగరంలోని చెరువులు, వాగులు, నాళాలు ఆక్రమించబడడం. ఒకప్పుడు నీటి మార్గాలుగా ఉన్న చోట్ల ఇప్పుడు భవనాలు, షాపింగ్ మాల్స్, రోడ్లు నిలిచిపోయాయి. నీరు తన సహజ మార్గాన్ని వెతుక్కుంటూ ఇళ్ళలోకి ప్రవేశించింది. అదే దృశ్యం 2020 తర్వాత హైదరాబాద్లో, 2022లో బెంగళూరులో కూడా పునరావృతమైంది. హైదరాబాద్ వంటి నగరాల్లో "మూసి" నది ఒకప్పుడు జీవనాధారం. ఇప్పుడు అది కాలుష్యపు నదిగా మారిపోయింది. వర్షం పడగానే పాత బస్తీ ప్రాంతాలు మొదట మునుగుతాయి. కారణం డ్రైనేజ్ వ్యవస్థ పాతబడిపోయి ఉండటం, నాళాలపై ఆక్రమణలు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నీరు ఆగిపోవడం. నగరాభివృద్ధి పేరుతో ప్రతి అంగుళం భూమి నిర్మాణాల కోసం ఉపయోగించబడుతోంది. నీలం రంగులో కనిపించే చెరువులు గూగుల్ మ్యాప్లో మాత్రమే మిగిలిపోయాయి. నగర ప్రణాళికల్లో "నీటి ప్రవాహ దారులు" అనే మాట లేని పరిస్థితి. బెంగళూరు పరిస్థితి కూడా అంతే. ఒకప్పుడు "సరస్సుల నగరం"గా పేరు గాంచిన బెంగళూరు, ఇప్పుడు వరదల నగరంగా మారిపోయింది. అక్కడి వరదలకు కారణం కేవలం వర్షం కాదుబీ వరుసగా సరస్సులను కలిపే నాళాలు మూసివేయబడటం, చెరువులపై నిర్మాణాలు పెరగడం. ఐటీ కంపెనీలు, టెక్ పార్కులు, హైఎండ్ కాలనీలు నిర్మించడానికి ప్రకృతిని త్యాగం చేసిన నగరం ఇప్పుడు వర్షం పడగానే పాఠం నేర్పుతోంది. ఇది మనం ప్రకృతిని ఎగతాళి చేసినదానికి ప్రకృతి ఇచ్చిన ప్రతిస్పందన అని చెప్పాలి.ప్రకృతి తన నియమాలకు కట్టుబడి ఉంటుంది. కానీ మనం నగరాలను కాంక్రీట్ అడవులుగా మార్చి, నీటి మార్గాలను మూసి, చెట్లను నరికేసి "అభివృద్ధి" అని పిలుస్తున్నాం. ఇది అభివృద్ధి కాదు, "నిర్లక్ష్యానికి కట్టిన స్మారకం." నగరాల రూపకల్పనలో వాతావరణ పరిస్థితులు, నీటి ప్రవాహ దారులు, భూభాగ ఆకృతి వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరం. వర్షం వచ్చినప్పుడల్లా నగరాలు మునగడం అనేది ప్లానింగ్ వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ. ఈ సమస్యలో మరో ముఖ్య కారణం పాలనలో సమన్వయం లేకపోవడం. పట్టణ అభివృద్ధి సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, రెవెన్యూ విభాగం, పర్యావరణ శాఖ ు ఇవన్నీ తమ తమ విధుల్లో ఉండి, పరస్పర సంబంధం లేకుండా పనిచేస్తున్నాయి. ఫలితంగా నియంత్రణ లేకుండా భవన అనుమతులు ఇస్తున్నారు. ఆక్రమణలు రాజకీయ ప్రభావంతో పెరుగుతున్నాయి. తాత్కాలిక డ్రైనేజీ క్లీనింగ్తో సమస్య పరిష్కారమవదని, దీని వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాస్త్రీయ ప్రణాళిక అవసరమని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో పౌరుల బాధ్యత కూడా తక్కువ కాదు. ప్రతి వర్షాకాలంలో వీధుల్లో ప్లాస్టిక్, వ్యర్థాలు పడేయడం, నాళాల్లో చెత్త నింపడం మనమే చేస్తున్నాం. ప్రభుత్వం తప్పు చేస్తే మనం కూడా మినహాయింపుకాదు. మన నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం, నీటి మార్గాలను కాపాడడం పౌరుడి కర్తవ్యం. కానీ మనం రోజువారీ సౌకర్యాలకే ప్రాధాన్యం ఇస్తూ, దీర్ఘకాలిక ఫలితాలను మరచిపోతున్నాం. ఇప్పుడు సమయం మార్పు కోరుకుంటోంది. వరదలతో పోరాడడం కంటే, వాటి కారణాలను తొలగించడం తెలివైన మార్గం. ప్రతి నగరానికి వర్ష జల ప్రణాళిక, చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, వర్షపు నీరు నిల్వ సదుపాయాలు ఇవన్నీ సమగ్రంగా అమలులోకి రావాలి. ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, పౌరులు కలిసి చర్యలు తీసుకున్నప్పుడే నగరాలు సురక్షితంగా ఉండగలవు.

చివరగా, మనం ప్రకృతిని గెలవలేం ఆమెతో సహజీవనం చేయడం నేర్చుకోవాలి. నగర వరదలు ప్రకృతి వైపరీత్యాలు కావుబీ అవి మన నిర్లక్ష్యానికి ప్రతిఫలాలు. ప్రకృతిని అవమానిస్తే, ఆమె ప్రతిస్పందన ఎప్పుడూ కఠినంగానే ఉంటుంది. పాఠం మనకు ఇప్పటికే వచ్చేసిందిబీ ఇప్పుడు దాన్ని అమలుచేయడం మన బాధ్యత.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# గాంధారి'లో తాప్సీ తెగువ

## డూప్ లేకుండా యాక్షన్ సీన్స్, రివెంజ్ డ్రామా

బాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ, తన నటనకు ప్రాధాన్యతనిచ్చే నటిగా పేరుగాంచిన తాప్సీ పన్ను, తన తాజా చిత్రం 'గాంధారి' కోసం మరోసారి సరికొత్త యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్నారు. కిడ్నాప్ అయిన తన కుమార్తెను కాపాడుకోవడం కోసం ఒక తల్లి చేసే సాహసాలు, పడే పోరాటమే ఈ రివెంజ్ డ్రామా యొక్క ప్రధాన కథాంశం. ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు చాలా ఎక్కువ మొత్తంలో ఉండగా, తాప్సీ వాటిని మరెవరి సహాయం లేకుండా, అంటే డూప్ (బాడీ-డబుల్) లేకుండా స్వయంగా చేశారు. ఈ సన్నివేశాలు సహజంగా మరియు శక్తివంతంగా కనిపించాలనే ఉద్దేశంతోనే ఆమె ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. దేవాశిష్ మఖీజా దర్శకత్వంలో మరియు కనికా ధిల్లాన్ రచన, నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం తల్లి-బిడ్డల మధ్య ఉన్న లోతైన బంధాన్ని, ఒక తల్లి తన బిడ్డ కోసం ఎంత దూరం వెళ్లగలదో అనే అంశాన్ని చాలా శక్తివంతంగా చూపిస్తుంది. ఈ సినిమాలో తాప్సీ ఒక ఉగ్రరూపం దాల్చిన, దృఢ నిశ్చయం గల తల్లి పాత్రలో కనిపిస్తారు. తాప్సీ ఈ సినిమా గురించి మాట్లాడుతూ, ఇది కేవలం మానసికంగానే కాక, శారీరకంగా కూడా చాలా డిమాండిరగ్ అయిన ప్రాజెక్ట్ అని తెలిపారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, ఒక కొత్త నటుడిలా ప్రతి షాట్‌కు తన శక్తిని మొత్తం ధారపోసినట్లు ఆమె చెప్పారు. ఈ యాక్షన్-థ్రిల్లర్ చిత్రం యొక్క షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా, కష్టపడి పనిచేయడం వల్ల కలిగిన శారీరక గాయాల గురించి ప్రస్తావిస్తూ, "కొన్ని గాయాలు మునుపెన్నడూ లేని సంతృప్తిని ఇస్తాయి" అని తాప్సీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'గాంధారి' చిత్రం థియేటర్లలో కాకుండా, ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన నెట్‌ఫ్లిక్స్ ద్వారా ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. ఈ సంవత్సరంలోనే ఈ సినిమా ఓటీటీలో విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రంలో ఇష్వాక్ సింగ్ కూడా ఒక ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. మొత్తం మీద, డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్‌లలో నటించిన తాప్సీ యొక్క తెగువ, మరియు ఒక తల్లి పోరాటంతో కూడిన కథాంశం 'గాంధారి' చిత్రంపై ప్రేక్షకులలో భారీ అంచనాలను పెంచింది. ఈ సినిమా తాప్సీ కెరీర్‌లో మరో బలమైన పాత్రగా నిలిచిపోతుందని భావిస్తున్నారు.



# సౌత్ సినిమాల ఎదుగుదల సంతోషకరం: నటి ప్రియమణి

దక్షిణాది సినిమాల ఎదుగుదల, వాటిని ప్రేక్షకులు ఆదరిస్తున్న తీరుపై ప్రముఖ నటి ప్రియమణి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, వివిధ భాషల్లోని కంటెంట్‌ను స్వీకరించడానికి ప్రేక్షకులు మరింత సుముఖంగా ఉన్నారని ఆమె తెలిపారు. ''చివరకు ప్రజలు దక్షిణాది సినిమాలను చూస్తున్నందుకు, ప్రాంతీయ భాషల్లో రూపొందించిన చిత్రాలను అంగీకరిస్తున్నందుకు నేను సంతోషిస్తున్నాను. ఇది ఎప్పుడూ ఉండేదే, కానీ అప్పట్లో దీనికి అంత ప్రాముఖ్యత లభించలేదు,'' అని ప్రియమణి అన్నారు. ప్రస్తుతం ఈ మార్పును గమనించడం చాలా ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. సినిమాలతో పాటు, చిత్ర పరిశ్రమలోని మొత్తం వ్యవస్థకు ఈ ఆదరణ విస్తరించిందని ప్రియమణి అభిప్రాయపడ్డారు. ''ప్రతి భాషలో అద్భుతమైన సినిమాలు వచ్చాయిబీ వాటి గురించి ఇంతకు ముందు మాట్లాడేవారు కాదు. కానీ ఇప్పుడు మాట్లాడుతున్నారు, అది చాలా గొప్ప విషయం. కేవలం సినిమాల గురించే కాకుండా, సాంకేతిక నిపుణులు, నటులు, దర్శకుల గురించి కూడా చర్చ జరుగుతోంది,'' అని ఆమె వివరించారు. ఈ మార్పు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, మొత్తం పరిశ్రమకు మేలు చేస్తుందని ఆమె అన్నారు.

ప్రాంతీయ మరియు హిందీ సినిమా మధ్య సరిహద్దులు చెరిగిపోతున్నాయని ప్రియమణి ఆశాభావం వ్యక్తం చేశారు. ''ఆ సరిహద్దులు కొంతవరకు మసకబారుతున్నాయని నేను భావిస్తున్నాను, మరియు అవి ఏదో ఒక రోజు పూర్తిగా చెరిగిపోవాలని నేను ఆశిస్తున్నాను,'' అని ఆమె అన్నారు. భాషా భేదాలు లేకుండా, మంచి కంటెంట్‌ను దేశవ్యాప్తంగా ఆదరించడం అనేది ఆరోగ్యకరమైన పరిణామమని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. సినిమా మరియు  వేదికలపై పనిచేయడం మధ్య ఉన్న తేడాను గురించి కూడా ప్రియమణి ఈ సందర్భంగా పంచుకున్నారు. మెయిన్‌స్ట్రీమ్ సినిమాలో ఒకే రకమైన పాత్రలకు పరిమితమయ్యే అవకాశం ఉంటుందని, కానీ (ఓటీటీ) కంటెంట్‌లో ప్రయోగాలు చేయడానికి మరియు వైవిధ్యమైన పాత్రలు పోషించడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. మొత్తానికి, దక్షిణాది చిత్రాలకు వస్తున్న ఆదరణ పట్ల ఆమె తన సంతోషాన్ని, పరిశ్రమలో వస్తున్న మార్పుల పట్ల తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.





# 'అఖండ 2' నుండి 'బ్లాస్టింగ్ రోర్' గ్లింప్స్ విడుదల: ఊహకు అందదు!

నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'అఖండ 2' నుండి ఇటీవల విడుదలైన చిన్న టీజర్ (గ్లింప్స్) అభిమానులను ఒక ఊపు ఊపేసింది. 'బ్లాస్టింగ్ రోర్' పేరుతో విడుదల చేసిన ఈ గ్లింప్స్, అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా బాలకృష్ణ మార్క్ మాస్ ఎలిమెంట్‌స్‌తో నిండి ఉంది. కేవలం కొన్ని సెకన్ల నిడివి ఉన్నప్పటికీ, ఈ టీజర్ సినిమాపై హైప్‌ను అమాంతం పెంచింది. ఈ గ్లింప్స్‌లో బాలకృష్ణ పవర్‌ప్యాక్డ్ డైలాగ్‌తో కనిపించారు. ''ఏ సౌండ్‌కు నవ్వుతానో.. ఏ సౌండ్‌కు నరుకుతానో నాకే తెలియదు కొడకా.. ఊహక్కూడా అందదు!'' అంటూ బాలకృష్ణ చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించింది. దర్శకుడు బోయపాటి శ్రీను ఈ డైలాగ్‌ను బాలకృష్ణ పాత్ర తీవ్రతను, ఉగ్ర రూపాన్ని చూపించేలా తీర్చిదిద్దిన తీరు అద్భుతం. ఈ పవర్‌ప్యాక్డ్ విజువల్స్ మరియు డైలాగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ రికార్డు వ్యూస్ సాధిస్తున్నాయి.

'అఖండ' (2021) చిత్రం సాధించిన భారీ విజయం నేపథ్యంలో, దాని సీక్వెల్ లిలి'అఖండ 2'లిలిపై ప్రేక్షకులలో విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ఈ గ్లింప్స్ ఆ అంచనాలను మరింత పెంచేలా ఉంది. మొదటి భాగంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న బాలకృష్ణ ఉగ్రరూపం, యాక్షన్ సన్నివేశాలు ఈ రెండో భాగంలో మరింత హైవోల్టేజ్‌లో ఉండబోతున్నాయని ఈ గ్లింప్స్ స్పష్టం చేస్తోంది. సినిమా మేకింగ్ విలువలు, యాక్షన్ కొరియోగ్రఫీ ఉన్నత స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా, 'అఖండ 2' 'బ్లాస్టింగ్ రోర్' గ్లింప్స్ బాలయ్యబోయపాటి కాంబినేషన్ యొక్క మ్యాజిక్‌ను మరోసారి రుజువు చేసింది. కేవలం చిన్న టీజర్ ద్వారానే సినిమా పవర్ ఏ స్థాయిలో ఉండబోతుందో ప్రేక్షకులకు రుచి చూపించారు. ఈ గ్లింప్స్ విడుదలైన తర్వాత, సినిమా విడుదల కోసం అభిమానులు మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే తదుపరి అప్‌డేట్‌లను ప్రకటిస్తారని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# 'దేవర'లో జాన్వీ కపూర్ 'తంగమ్'గా: డీగ్లామరస్ పాత్రలో తొలి తెలుగు ఎంట్రీ!

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో తొలిసారిగా అడుగుపెడుతున్న చిత్రం జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'దేవర'. ఈ సినిమా నుండి ఆమె పాత్రకు సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడిరది. ఈ చిత్రంలో ఆమె పోషిస్తున్న పాత్ర పేరు 'తంగమ్' అని తెలుస్తోంది, దీనికి 'బంగారం' అని అర్థం. జాన్వీ కపూర్ ఒక శక్తివంతమైన మరియు డీ-గ్లామరస్ పాత్రతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానుండటం విశేషం. 'దేవర' చిత్రం దేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాల నేపథ్యంతో రూపొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్ర కథాంశం ప్రకారం, జాన్వీ కపూర్ ఒక మురికివాడ బస్తీలో జీవనం సాగించే యువతి పాత్రలో కనిపించబోతున్నారు. ఆమె పాత్ర స్వభావం దృష్ట్యా, కొన్ని సన్నివేశాలలో ఆమె డీ-గ్లామరస్‌గా కనిపించాల్సి ఉంటుంది. సాధారణంగా గ్లామరస్ పాత్రలకే ప్రాధాన్యత ఇచ్చే జాన్వీ, తన తొలి తెలుగు సినిమాతోనే ఇంతటి ఛాలెంజింగ్ మరియు డీ-గ్లామరస్ రోల్‌ను ఎంచుకోవడం ఆమె పాత్రకు ఉన్న ప్రాధాన్యతను సూచిస్తుంది. జాన్వీ కపూర్ ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాత్ర యొక్క వేషధారణ, శరీర భాషతో పాటు, తెలుగు భాష యొక్క ఉచ్ఛారణలో స్పష్టత ఉండేలా ఆమె ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారట. ఇది కేవలం ఒక గ్లామర్ పాత్ర కాకుండా, కథాగమనంలో ముఖ్యమైన పాత్రగా ఉంటుందని సినీ వర్గాల సమాచారం. జాన్వీ పాత్రకు సంబంధించిన లోతు ఈ సినిమాలో హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. 'దేవర' మొదటి భాగం అక్టోబర్ 10న విడుదల కానుంది. ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్న ఈ చిత్రం, దేశవ్యాప్తంగా అంచనాలను భారీగా పెంచింది. ఈ డీ-గ్లామరస్ పాత్రలో జాన్వీ నటన చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# ఈ భాగాలకు నూనె రాయడం వల్ల రోగాలేవీ రావట..!

నూనెను చాలా మంది ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. కొందరు నార్మల్ గా ఉపయోగిస్తే కొందరు రోజు కచ్చితంగా ఉపయోగిస్తుంటారు. మరి మీలో ఎంత మంది రోజు నూనెను ఉపయోగిస్తారు?ఏ అవయవాలకు ఉపయోగిస్తుంటారు. కొందరు తలకు కూడా వారానికి ఒకసారి అయినా నూనె పెట్టరు. కానీ కొందరు ప్రతి రోజు పెడుతుంటారు. ఇదెలా ఉంటే శరీరంలోని నాలుగు భాగాలకు మాత్రం కచ్చితంగా నూనె రాయాలట. ఇలా చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు అంటున్నారు నిపుణులు.తలకు కచ్చితంగా నూనె రాయాలట. ఇలా రాయడం వల్ల మెదడు చల్లబడి మనసు ప్రశాంతంగా ఉంటుందట. ఇక మరొకరకంగా చూస్తే శరీరానికి కూడా నూనెను రాయాలి అంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల సంతోషకరమైన హార్మోన్లు విడుదల అవుతాయట. పడుకునేటప్పుడు మోకాళ్ళకు నూనె రాయాలి అంటారు నిపుణులు. ఇలా చేయడం వల్ల కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చట. చేతులకు కూడా క్రమం తప్పకుండా నూనె రాయాలట. ఇలా చేయడం వల్ల చేతులు పొడిబారకుండా ఉంటాయట. గోళ్ల మీద కూడా నూనె రాయాలట. ఇలా చేయడం వల్ల తేమగా ఉంటూ గోళ్లు ఆరోగ్యంగా ఉంటాయట. ఇక చాలా మంది తలకు నూనెను మాత్రం క్రమం తప్పకుండా రాసుకుంటారు. కొందరు తలస్నానం చేసేకంటే ముందు రోజు నూనె పెట్టుకుంటారు. కానీ మొత్తం మీద నూనె రాసుకోవడం మాత్రం అలవాటు. గోళ్లకు, తలకు, చేతులకు, మోకాళ్లకు నూనె మాత్రం రాస్తూనే ఉండాలి అంటున్నారు నిపుణులు.

# టీ తాగడం వల్ల నల్లగా మారుతారా?




టీని ఇష్టపడని వారు ఎవరు ఉంటారు. టీ అంటే అందరికీ ఇష్టమే. ఆఫీసులో ఉన్నా ఇంట్లో ఉన్నా టీ మాత్రం ఉదయం సాయంత్రం ఓ సిప్ పడాల్సిందే అంటారు చాలా మంది.మరి టీ తాగడం వల్ల కొందరు రంగు మారుతారు అనుకుంటారు. నిజంగానే టీ తాగితే కలర్ మారుతారా? నల్లగా అవుతారా అనే వివరాలు తెలుసుకుందాం. కొందరు దీనిని నిజం అని అంగీకరిస్తే.. మరికొందరు దీనిని పుకారు అంటారు. మీరు కూడా ఈ విషయంలో అయోమయంలో ఉన్నట్లయితే, ఈ రోజు ఆరోగ్య నిపుణులు ఏమని చెప్పారో ఓ సారి లుక్ వేయండి. టీ తాగడానికి ప్రజల ఛాయతో ఎలాంటి సంబంధం లేదని అంటున్నారు నిపుణులు. టీ తాగడం వల్ల నల్లగా మారుతారు అనడం కేవలం అపోహ మాత్రమేనట. ఈ విషయంలో సందేహం అవసరం లేదు అంటున్నారు. వ్యక్తుల చర్మ రంగు వారి జన్యుపరమైన కారకాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. మీరు ఎంత టీ తాగినా అది మీ ఛాయపై ప్రభావం చూపదు అని తేల్చి చెప్పారు. చాలా వేడిగా ఉన్న టీ తాగడం వల్ల కొన్నిసార్లు పెదవులపై పిగ్మెంటేషన్ ఏర్పడవచ్చు, కానీ టీ పెదవుల రంగును మార్చదు.టీని అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో యాంటీఆక్సిడెంట్ల లోపం ఏర్పడుతుందని.. అందుకే పరిమితిగా మాత్రమే టీ తాగాలి అని సలహా ఇస్తున్నారు. కొందరు స్కిన్ కలర్ ఫెయిర్ గా ఉండేలా ట్రీట్ మెంట్ తీసుకుంటారు, అయినా కూడా స్కిన్ కలర్ శాశ్వతంగా మార్చుకోలేకపోతారు. కొంత సమయం తరువాత, చర్మం దాని సహజ రూపానికి తిరిగి వస్తుంటుంది. వేసవిలో చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే, ప్రజలు తగిన మోతాదులో నీరు తాగాలి. శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుకోవాలి. ఈ సీజన్‌లో పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.. విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల చర్మం మెరుగుపడుతుంది. ప్రజలు తమ రోజును టీతో ప్రారంభిస్తారు. టీ లేకుండా రోజు అసంపూర్ణంగా అనిపిస్తుంది. అన్ని కాలాల్లో టీ తాగడానికి అందరూ ఇష్టపడతారు.కొందరికి మసాలా టీ అంటే ఇష్టం ఉంటుంది. ఈ టీ తాగడం వల్ల శరీరం, మనస్సు రెండూ చురుకుగా ఉంటాయట.కానీ టీ విషయంలో కాస్త జాగ్రత్త. లిమిట్ గా తీసుకోండి.

# పెరుగులో ఉప్పు, చక్కెర ఏది కలిపి తింటున్నారు?

పాలు, పెరుగు వంటివి తినడం చాలా మందికి ఇష్టం. ఇక అన్నం తిన్న తర్వాత ఒక ముద్ద అయినా పెరుగు తినాలి అనిపిస్తుంది. వేసవి కాలంలో దీని డిమాండ్ మరింత ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఇది మన కడుపును చల్లగా ఉంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అంతే కాకుండా మన ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది పెరుగు. కొందరు పెరుగులో ఉప్పు వేసి తింటే మరికొందరు చక్కెర వేసుకుంటారు. కొందరు వట్టి పెరుగును మాత్రమే తింటారు. మరి ఉప్పు, చక్కెర ఈ రెండిరటిలో ఏది మంచిది అనే వివరాలు ఓ సారి చూసేయండి. పెరుగును ఎలా తినాలి? దీని వల్ల ఫిట్ గా ఉండాలి అంటే ఏం చేయాలో కూడా తెలుసుకుందాం. పెరుగులో ఏది కలుపుకుని తినాలో తెలియక చాలామంది అనుమానంతో ఉంటారు. ఆయుర్వేదం ప్రకారం, మీరు పెరుగులో చక్కెర లేదా ఉప్పు వేయకుండా, సాదాగా తినడానికి ప్రయత్నించండి. ఉప్పు, లేదా చక్కెర ఏది లేకుండా తినకపోతే కాస్త చక్కెరతో తినండి.మధ్యాహ్నం, రాత్రి సమయంలో కాస్త ఉప్పు కలుపుకొని తినండి. మొత్తం మీద రాత్రిపూట పెరుగు తినకుండా ఉండటానికి ట్రై చేయండి. కొందరికి ప్రతిరోజూ పెరుగు తినడం వల్ల సమస్యలు కూడా రావచ్చు. అలాగే పెరుగులో తేనె, నెయ్యి, పంచదార, ఉసిరికాయ కలిపి తింటే ఆరోగ్యం బాగుంటుంది అంటున్నారు నిపుణులు. డయాబెటిక్ ఉన్నవారు చక్కెరకు బదులుగా ఉప్పు కలపుకొని తినాలి. ఉప్పు కలిపి పెరుగును తినడం వల్ల జీర్ణం అవుతుందట. కానీ అధిక రక్తపోటు ఉన్నవారు మాత్రం ఉప్పుతో తినకూడదు అంటున్నారు నిపుణులు. తింటే కచ్చితంగా బీపీ వస్తుందట. స్ట్రోక్, హైపర్ టెన్షన్ వచ్చే అవకాశం కూడా ఉంది. పెరుగు లస్సీ కూడా వేసవిలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పెరుగులో చక్కెరను కలిపి తింటే చల్లదనం అంటారు నిపుణులు. దీని వల్ల మీరు వేడి నుండి ఉపశమనం పొందుతారు. దీంతో పాటు శరీరంలో శక్తి వచ్చి తాజాదనాన్ని కలిగిస్తుంది. హైడ్రేషన్ కూడా బాగానే ఉంటుంది . నీటి కొరత ఉండదు. కాబట్టి పెరుగును తినండి. కానీ కాస్త జాగ్రత్తగా తెలుసుకొని తినండి.




# బ్రౌన్ బ్రెడ్ ప్రయోజనాలు...




కొన్ని ఆహారాలను తినడం చాలా మందికి అలవాటు. కానీ వాటి వల్ల జరిగే ప్రయోజనాలు మాత్రం తెలియదు. తెలియకున్నా వారి ఆరోగ్యం మాత్రం పదిలంగా ఉంటుంది. అదే విధంగా మీకు బ్రౌన్ బ్రెడ్ తినే అలవాటు ఉందా? ఉంటే ఎప్పుడు తింటారు? ఎలా తింటారు అనే విషయాలు ఆలోచించాల్సిన అవసరం లేదు. ఓ సారి దీని వల్ల ఉపయోగాలు తెలిస్తే మీ డైట్ లో కచ్చితంగా ఈ బ్రౌన్ బ్రెడ్ ఉండేలా చేసుకుంటారు. మనలో చాలా మంది తెల్లగా ఉండే బ్రెడ్‌నే తింటారు. అయితే బ్రౌన్ బ్రెడ్‌తోనే చాలా రకాల ప్రయోజనాలు ఉన్నాయి అంటున్నారు పోషకాహార నిపుణులు. ఇదెలా ఉంటే వైట్ బ్రెడ్ తినడం వల్ల కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నాయట. అయితే ఈ బ్రెడ్ తినడం వల్ల బరువు పెరగుతారట. అంతేకాదు బ్లడ్‌లో షుగర్ లెవల్స్ కూడా పెరుగుతాయట. ఈ బ్రౌన్ బ్రెడ్ తినడం వల్ల పోషకాలు అందడమే కాదు.. ఎన్నో సంవత్సరాల నుంచి బాధ పడెతున్న వ్యాధులకు కూడా చెక్ పెట్టవచ్చట. బ్రౌన్ బ్రెడ్‌లో ఫైబర్, ప్రోటీన్ కంటెంట్ మెండుగా ఉంటుంది. ఇది తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలను తగ్గించుకోవచ్చు. పేగు కదలికలకు సహాయ పడుతుంది. పొట్ట సమస్యలను కూడా తగ్గిస్తుంది. అంతే కాకుండా ఇది కొద్దిగా తీసుకున్నా కడుపు నిండుతుంది. అలాగే శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ లెవల్‌స్‌ను తగ్గిస్తుంది. దీంతో ఈజీగా బరువు తగ్గించుకోవచ్చు. అంతే కాకుండా బీపీ, షుగర్ వంటి వాటిని నియంత్రణలో ఉంచుతుంది. షుగర్, బీపీ ఉండేవారు బ్రౌన్ బ్రెడ్ తీసుకోవడం ఉత్తమం. బ్రౌన్ బ్రెడ్ ను గోధుమ పిండితో తయారు చేస్తారు కాబట్టి.. పుష్కలంగా పోషకాలు లభిస్తాయి. ఇది తిన్న వెంటనే శరీరంలో తక్షణమే శక్తి పెరుగుతుంది.

# రాత్రి స్నానం చేయడం మంచిదా?



రాత్రి స్నానం చేయడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని తెలియగానే చాలా మంది రాత్రి సమయంలో స్నానం చేస్తున్నారు. ఇక ఉదయం నుంచి చెమటతో బాధ పడి రాత్రి స్నానం చేసి హ్యాపీ గా పడుకోవడం చాలా మందికి ఇష్టం.అందుకే చాలా మంది ప్రతి సీజన్‌లో రాత్రి స్నానం చేసిన తర్వాతే నిద్రపోతారు. మరి ఇలా రాత్రి స్నానం చేయడం నిజంగా మేలు చేస్తుందా లేదా అనే విషయాలు తెలుసుకుందాం. వేసవిలో రాత్రి పూట స్నానం చేయడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది అంటున్నారు నిపుణులు. రోజంతా పరిగెత్తడం వల్ల, చెమట, ధూళి . విషపూరిత బ్యాక్టీరియా కూడా ప్రజల శరీరాలపై పేరుకుపోవచ్చు. ఇది ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అటువంటి పరిస్థితిలో, రాత్రిపూట స్నానం చేయడం వల్ల మీ శరీరం శుభ్రం అవుతుంది. మీకు మంచి నిద్ర వస్తుంది. మీరు రాత్రిపూట చల్లని లేదా గోరువెచ్చని నీటితో స్నానం చేయవచ్చు. రాత్రిపూట స్నానం చేయడం వల్ల మీ ఒత్తిడి తగ్గుతుంది . మీ మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఇది మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఏ సీజన్ లోనైనా మంచినీటితో స్నానం చేయవచ్చుట. కానీ చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యలు రావచ్చు అంటున్నారు. అధికంగా రోగనిరోధక శక్తి ఉంటే వారు మాత్రం చల్లని నీటితో స్నానం చేయవచ్చు. రాత్రి భోజనం చేసిన వెంటనే స్నానం చేయకూడదట. అలా చేయడం వల్ల జీర్ణక్రియ సమస్యలు వస్తాయట. వాస్తవానికి, రాత్రి భోజనం తర్వాత మన శరీర జీర్ణక్రియకు చురుకుగా అవుతుందట. ఈ సమయంలో స్నానం చేయడం వల్ల ఈ జీర్ణక్రియ ప్రక్రియ ప్రభావితం అవుతుందట. ప్రజలు రాత్రి భోజనానికి , నిద్రించడానికి కనీసం 12 గంటల ముందు స్నానం చేయడం ఉత్తమం అంటున్నారు. మీకు ఏ రకమైన ఆరోగ్య సమస్యలు ఉన్నా.. రాత్రిపూట స్నానం చేయడం వల్ల మీ సమస్యలు పెరుగుతుంటే కచ్చితంగా వైద్యుడిని సంప్రదించండి. శరీరాన్ని వెచ్చగా ఉంటే బట్టలు ధరించడం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చు. మీరు పిల్లలను బయటకు తీసుకువెళితే, వారి చెవులను కప్పేలా జాగ్రత్త పడండి. పిల్లలకు గోరు వెచ్చని నీటిని ఇవ్వండి. కొన్ని రోజులుగా వేడి తన ప్రతాపం చూపిస్తుంది. ఈ క్రమంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కొన్నిసార్లు వర్షం, కొన్నిసార్లు సూర్యరశ్మి, కొన్నిసార్లు తీవ్రమైన చలి, అన్నట్టుగా ఉంటుంది. అందుకే జాగ్రత్త.

# అధికంగా కొవ్వు ఉందా? అయితే వీటికి దూరంగా ఉండండి..



ఈ మధ్య చాలా మందిలో కొవ్వు సమస్య విపరీతంగా పెరుగుతుంది. దాన్ని నివారించడానికి చాలా కష్టాలు పడుతున్నారు. జిమ్, వాకింగ్, వ్యాయామం, డైట్ లు అంటూ అష్టకష్టాలు పడుతున్నారు.కానీ కొందరు సీరియస్ గా చేస్తే మరికొందరు గ్యాప్ లు తీసుకుంటూ చేస్తుంటారు. దీని వల్ల ఫలితం శూన్యంగా ఉంటుంది. ఇక మీరు కూడా కొవ్వుతో బాధ పడుతున్నారా? మరి మీ శరీరంలో ఉన్న కొవ్వు ఇట్టే కరగాలి అంటే ఏం చేయాలో ఓ సారి చూడండి.కొన్ని ఆహారాలను పరిగడుపున అసలు తినకూడదు. దీని వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. ఇక శరీరంలో పేరుకున్న కొవ్వు వల్ల కూడా చాలా సమస్యలు వస్తాయి. ఎక్కువ ఆహారం తీసుకొని తక్కువ పని చేస్తే కచ్చితంగా కొవ్వు పెరుగుతుంటుంది. ఈ అధిక కొవ్వు కారణంగా రక్తనాళాలు బ్లాక్ అయ్యి గుండె పోటు వచ్చే సమస్య కూడా ఉంటుంది. అంతేకాదు ఈ కొవ్వు వల్ల జీర్ణక్రియకు సంబంధించిన చాలా సమస్యలు వస్తుంటాయి. మనం తినే ఆహారంలో ఎప్పుడు కూడా ఒకే రకమైన నూనెను వాడకూడదు. రెండు రకాల నూనెలను కలిపి ఉపయోగిస్తే అధిక కొవ్వుకు చెక్ పెట్టవచ్చు. ఆయిల్ ఫుడ్ ల కంటే పండ్లు, కూరగాయలు వంటివి తీసుకోవాలి. వీటి వల్ల ఆరోగ్యానికి శక్తితో పాటు కొవ్వు కూడా అదుపులో ఉంటుంది. బయట ఫుడ్ వీలైనంత తగ్గిస్తే కొవ్వుకు దూరంగా ఉండవచ్చు. రోజు మూడు పచ్చి వెల్లుల్లి రేకులు, ఉల్లిపాయలు తినడం మంచిది. ఆరోగ్యం కోసమని జీడిపప్పులు, వేరుశనగలను మాత్రం ఎక్కువగా తినవద్దు. కొవ్వు ఉండకూడదు అంటే జంక్ ఫుడ్స్ కు వీలైనంత దూరంగా ఉండాలి అని గుర్తు పెట్టుకోండి. ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను మాత్రమే తీసుకోండి. ఇతర పదార్థాల జోలికి వెళ్లకండి.

# పందెం యాప్స్ వెనుక రాజకీయ మాయ
# చట్టాలు బలహీనమైతే ప్రాణాలు బలి

స్క్రీన్‌పై మెరుస్తున్న కలర్‌ఫుల్ గ్రాఫిక్స్ 'జస్ట్ 10 రూపాయలు పెట్టి 10 వేల గెలుచుకోండి' అనే ఆకర్షణీయమైన నోటిఫికేషన్లు 'మీ ఫ్రెండ్ ఇప్పటికే 5 వేల గెలిచాడు' అనే ఫేక్ అలర్ట్‌లు ఇదే కొత్త తరహా నేరాల ఎంట్రీ పాయింట్. ఇవి కేవలం గేమ్స్ కావు, మనసును నియంత్రించే మానసిక జూదపు మాదక ద్రవ్యాలు. ఒకసారి వీటిలోకి అడుగుపెడితే తిరిగి రావడం కష్టమే. ఇదే కారణంగా దేశవ్యాప్తంగా యువత ఆర్థిక నష్టాలతో, మనస్తాపంతో ఆత్మహత్యలకు దారి తీస్తోంది. ఆన్‌లైన్ గేమ్స్ అసలు వినోదం కోసం ప్రారంభమయ్యాయి. కానీ వాటిని వ్యాపారంగా మార్చిన పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు, అంతర్జాతీయ బెట్టింగ్ మాఫియాలు ఈ వినోదాన్ని మానసిక వ్యసనంగా మార్చేశాయి. మొట్టమొదట చిన్న మొత్తంలో గెలిపించటం, తరువాత వరుస ఓటములతో ఎక్కువ పెట్టించేలా ప్రేరేపించడంఇది వీరి మోసపూరిత వ్యూహం. మొదటి గెలుపు ఉచ్చు రెండో గెలుపు బలిదానం ఆ తరువాత జీవితాంతం అప్పుల నరకం.

కొంతమంది యువకులు ఆన్‌లైన్ జూదంలో కోల్పోయింది కేవలం డబ్బు కాదు వారి స్వీయ గౌరవం, వారి కుటుంబ నమ్మకం, జీవితంపై నమ్మకం కూడా కోల్పోతున్నారు. ''ఒక్కసారి పెద్ద మొత్తంలో గెలిస్తే తిరిగి పుంజుకుంటాను'' అనే మానసిక ఒత్తిడి చివరకు మరణాన్ని కూడా ఓ ఆప్షన్‌లా చూపిస్తోంది. తల్లిదండ్రులు గమనించని పెద్ద నిజం ఏమిటంటే ఈ గేమ్స్ కేవలం తీరికల సమయంలో ఆడేది కాదు, మనసు ఖాళీగా ఉన్న ప్రతిసారి మెదడు ఈ గేమ్‌నే గుర్తు చేస్తుంది. ఇది మానసిక బానిసత్వం. మద్యం మానవచ్చు, సిగరెట్ మానవచ్చు కానీ జేబులో మొబైల్ ఉన్నంత వరకు ఈ వ్యసనం ఎప్పటికీ చావదు. ఎందుకంటే మద్యం దుకాణం మూసివేయొచ్చు, కానీ



ఆన్‌లైన్ గేమింగ్ యాప్ క్లోజ్ చేయడానికి ఒక టాప్ చాలు మళ్ళీ అదే వరుస మొదలవుతుంది. కుటుంబ సభ్యులకు తెలియకుండా డిజిటల్ వాలెట్ల ద్వారా డబ్బులు మాయం అవుతాయి. మొదట చిన్న చిన్న ట్రాన్సాక్షన్లు, తరువాత పెద్ద డెబిట్‌లు బ్యాంక్ మెసేజ్ వచ్చే సరికి అంతా ముగిసిపోతుంది. దేశంలో అనేక ఆత్మహత్య కేసులు నమోదయ్యాయి. 2 వేల, 5 వేల రూపాయల లాభం కోసం మొదలైన గేమ్ చివరికి లక్షల్లో అప్పులు తెచ్చింది. ''సారీ అమ్మా%నా% నేను ఓడిపోయాను'' అనే నోట్ రాసి ప్రాణాలు తీసుకున్న యువకుడి లేఖ ఇప్పటికీ వేల మందికి మళ్ళీ ఆలోచించేలా చేస్తోంది. ఒక గేమ్ ఓటమి ఒక ఇంటి కన్నీళ్లు. ఈ పరిస్థితుల్లో సమాజం, ప్రభుత్వం, విద్యా వ్యవస్థ అందరూ ఒకే దిశలో ఆలోచించాలి. పిల్లలకు ఫోన్ ఇవ్వడం కన్నా, దాన్ని ఎలా ఉపయోగించాలో సిక్షణ ఇవ్వాల్సిన సమయం ఇది. ఆన్‌లైన్ గేమ్స్‌ను నిషేధించడం కంటే ప్రమాదాన్ని అర్థం చేయించడం ముఖ్యమైంది. ''ఇది కేవలం టైమ్ పాస్ కాదు జీవితాన్ని పందెంగా పెడుతున్న ఆట'' అనే అవగాహన రాకపోతే మరిన్ని మృతులు సంఖ్యగా నమోదవుతూనే ఉంటాయి.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లు కేవలం యాప్ రూపంలో ఉన్న పందేలు కాదు ు ఇవి లక్షల కోట్ల రూపాయల మాఫియా వ్యాపారం. వీటి వెనుక విదేశీ సర్వర్లు ఉంటాయి. డబ్బు భారత బ్యాంకుల్లో నుంచి వెళ్లినా, ట్రేస్ చేయడానికి సాధ్యం కాదు. అక్రమ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్, ఫేక్ ఫాంటసీ గేమ్ ప్లాట్‌ఫార్ములు, క్రిప్టో రూపంలో నల్ల ధనం మార్పిడి ఇవన్నీ కలిసి ఒక డిజిటల్ మాఫియా సామ్రాజ్యం నిర్మించాయి. ఆశ్చర్యం కలిగించేదేమిటంటే ు ఇవన్నీ టీవీల్లో, యూట్యూబ్‌లో, క్రికెట్ మ్యాచ్‌లలోగా ప్రకటనలు ఇస్తాయి.

ఇక్కడే రాజకీయ కోణం ప్రవేశిస్తుంది. పెద్ద పెద్ద బెట్టింగ్ కంపెనీలు ఎన్నికల్లో విరాళాల పేరుతో కోట్ల రూపాయలు ఇస్తాయని ఆరోపణలు ఉన్నాయి. చట్టాలు ఖచ్చితంగా పూర్తి నిషేధం విధించకుండా 'రెగ్యులేషన్' అనే పేరుతో తలుపు కొద్దిగా తెరిచి ఉంచాయి. ఆ చిన్న తలుపులో నుంచి మార్కెటింగ్ మాఫియా, ప్రకటన మాఫియా, యూట్యూబ్ ప్రమోటర్ల మాఫియా అన్నీ లోపలికి దూసుకెళ్లాయి. ప్రభుత్వం ఒక చేతితో ''ఆన్‌లైన్ బెట్టింగ్ అక్రమం'' అంటుంది, మరో చేతితో ప్రసార మాధ్యమాల ద్వారా ఆ యాప్‌ల ప్రకటనలపై వసూలు చేస్తుంది. అంటే ఒకవైపు నేరమని చెప్పి, మరోవైపు ఆదాయం తెచ్చుకునే మార్గంగా ఉపయోగిస్తున్నారు.

ఇది స్పష్టమైన రాష్ట్ర అబద్ధం.

ప్రశ్న: డబ్బు సంపాదించడానికి ప్రభుత్వం కూడా మౌనంగా చూస్తుంటే ఆత్మహత్య చేసిన యువకుడి తల్లికి న్యాయం ఎక్కడ?

సమాజం పాత్ర ఆడుకుంటున్నాడని చూసి నవ్వొద్దు, అతను జారిపోతున్నాడని గుర్తించు ఇంట్లో బిడ్డ గేమ్ ఆడుతుంటే, ''పర్లేదు, టైమ్ పాస్'' అని చెప్పి వదిలేస్తారు. కానీ అదే పిల్లవాడు జేబు ఖర్చు కోసం అబద్ధాలు చెప్తున్నాడా? రాత్రిళ్లు ఫోన్ ఇంకా వెలిగిందేనా? ''లూటీ లూటీ జాక్‌పాట్ మీకోసం ఎదురుచూస్తోంది'' అనే శబ్దాలు రాత్రంతా వినిపిస్తున్నాయా? ఇవి వార్నింగ్ సైరన్లు. ఇంట్లో ఎవరైనా ఒంటరిగా కూర్చొని స్క్రీన్‌కే జీవితం ఇస్తుంటే, అది వినోదం కాదు అది నిశ్శబ్ద వ్యసనం. స్నేహితులు ''గేమ్ వదిలి రా'' అని చెప్పడానికి భయపడుతున్నారు ఎప్పుడో ఒకప్పుడు అతను ఆడుకుంటున్నాడని ట్రోల్ చేసిన వాళ్ళే, అతని అంత్యక్రియలప్పుడు కన్నీళ్లు కారుస్తారు. సమాజం యువతను కాలువలో పడుతున్నట్టు చూస్తోంది కానీ వారిని బయటికి లాగడానికి చేయి అందించడం లేదు. మీడియా నిష్పక్షపాతంగా కన్నీళ్లు అమ్ముతూ, అదే మీడియాలో బెట్టింగ్ యాప్ ప్రకటనలు వార్తా చానళ్లను ఓపెన్ చేస్తేఒకవైపు ''బెట్టింగ్ మోసంతో యువకుడు ఆత్మహత్య'' అనే బ్రేకింగ్ న్యూస్. మరో వైపు అదే చానల్‌లో మ్యాచ్ మధ్యలో ''ఇప్పుడే రిజిస్టర్ అయి బోనస్ గెలుచుకోండి'' అనే ప్రకటన. ప్రకటనలు తీసుకుని లాభం సంపాదించేవి మీడియా సంస్థలు ఆ లాభం వల్లే ప్రజా చైతన్యం బలహీనపడుతోంది.

# దివాళి టపాసుల్లా కార్బైడ్ గన్ పేల్చి..



- 14 మంది చిన్నారులు కంటి చూపు కోల్పోయారు
- కార్బైడ్ గన్‌ల నిషేధం.. అయినా ఆగని అమ్మకాలు

సోషల్ మీడియాలో ఇటీవల బాగా వైరల్ అయిన కార్బైడ్ గన్ లేదా దేశీ ఫైర్‌క్రాకర్ గన్ అనే కొత్త ట్రెండ్ దీపావళి సందర్భంగా పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు పీడకలగా మారింది. గత మూడు రోజుల్లోనే మధ్యప్రదేశ్‌లో 122 మందికి పైగా చిన్నారులు ఈ ప్రమాదకరమైన బాణసంచాను కాల్చి తీవ్ర కంటి గాయాలతో ఆసుపత్రుల పాలయ్యారు. వీరిలో 14 మంది చిన్నారులు పూర్తిగా కంటి చూపు కోల్పోవడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. కార్బైడ్ గన్‌లను సాధారణంగా రైతులు కోతుల బెడద నుంచి పంటను కాపాడటానికి ఉపయోగిస్తారు. అయితే, దీపావళి టపాసుల మాదిరిగా వాడాలంటూ సోషల్ మీడియాలో ఈ గన్‌లు వైరల్ అయ్యాయి. పరిస్థితిని గ్రహించిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం అక్టోబర్ 18న వీటిపై నిషేధం విధించింది. అయినప్పటికీ, విదిషా జిల్లా మార్కెట్లలో ఈ కార్బైడ్ గన్‌ల అమ్మకాలు బహిరంగంగా జరిగాయి.

ప్లాస్టిక్ లేదా టిన్ పైపులను ఉపయోగించి ఈ గన్‌లను తయారుచేశారు. వాటిలో గన్‌పౌడర్, అగ్గిపుల్లల తలలు, మరియు కాల్షియం కార్బైడ్ నింపి, రంధ్రం ద్వారా నిప్పు అంటించేలా వీటిని రూపొందించారు. ఈ రసాయనాలు కలిసి మండటం వలన అది బాంబులా పేలి ముఖంపై, కళ్లపై నేరుగా ప్రభావం చూపిందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదాల కారణంగా చిన్నారులు తమ కంటి చూపును శాశ్వతంగా కోల్పోవడంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఏడేళ్ల తర్వాతే ఐఈపీఎఫ్‌నకు బదిలీ చేయాలి




మార్పిడి రహిత డిబెంచర్లు (ఎన్‌సీడీ) లేదా బాండ్లకు సంబంధించి క్లెయిమ్ చేసుకోని నిధులను కాలావధి (మెచ్యూరిటీ) ముగిసిన తేదీ నుంచి ఏడేళ్ల తర్వాతే ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ్)కు బదిలీ చేయాలని సెబీ ప్రతిపాదించింది. ఈ మేరకు కంపెనీల చట్టం, ఐఈపీఎఫ్ నిబంధనలకు తగ్గట్లుగా లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్ (ఎల్‌ఓడీఆర్) నిబంధనల్లో సవరణలు చేయనున్నట్లు తన చర్చా పత్రంలో వెల్లడించింది. ప్రస్తుతం కంపెనీల చట్టంలోని సెక్షన్ 125 ప్రకారం.. బాండ్ల డబ్బులను మదుపర్లు క్లెయిమ్ చేసుకోని పక్షంలో, వడ్డీతో కలిపి ఆ పూర్తి మొత్తాన్ని కాలావధి ముగిసిన తేదీ నుంచి ఏడేళ్ల తర్వాతే ఐఈపీఎఫ్‌నకు బదిలీ చేయాలి. ఐపీఈఎఫ్ నిబంధనల్లో నిబంధన 3(3) కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. అయితే ఎల్‌ఓడీఆర్ నిబంధనల్లోని 61ఏ నిబంధన ప్రకారం.. ఎస్క్రో ఖాతాలో ఏడేళ్ల పాటు క్లెయిమ్ చేసుకోని వడ్డీ ఏదైనా ఉంటే, బాండ్ల కాలావధి ముగింపుతో సంబంధం లేకుండా ఆ మొత్తాన్ని ఐఈపీఎఫ్ లేదా ఐపీఈఎఫ్‌నకు బదిలీ చేయాలి. కంపెనీల చట్టం, ఐపీఈఎఫ్ నిబంధనలకు ఇది భిన్నంగా ఉన్నందున.. ఎల్‌ఓడీఆర్ నిబంధనను కూడా వాటికి తగ్గట్లుగా సవరిస్తూ నిబంధన 61ఏ(3)తో కొత్త నిబంధనను తీసుకొని రావాలని సెబీ ప్రతిపాదించింది. దీని ప్రకారం.. బాండ్ల కాలావధి ముగిసిన రోజు నుంచి, ఏడేళ్ల తర్వాతే అన్‌క్లెయిమ్డ్ నిధులను ఐఈపీఎఫ్‌నకు బదిలీ చేయాలి. కంపెనీల చట్టం కిందకు రాని సంస్థలకూ ఇదే నిబంధన వర్తిస్తుందని సెబీ తెలిపింది. దీని వల్ల మదుపర్లకూ ప్రయోజనం ఉంటుందని.. కాలావధి ముగిశాక ఏడేళ్ల వరకు అన్‌క్లెయిమ్డ్ డబ్బుల రిఫండ్ కోసం ఐపీఈఎఫ్/ఐఈపీఎఫ్‌ను కాకుండా బాండ్లు జారీ చేసిన సంస్థలను ఆశ్రయించే వెసులుబాటు ఉంటుందని సెబీ వివరించింది.

# సైబర్ క్రైమ్.. డిజిటల్ యుగంలో పెరుగుతున్న అదృశ్య నేరాల నీడ

డిజిటల్ సౌకర్యాలు మన జీవితాల్లో ఎన్నో వేదికలు తెరిచాయాయి కానీ ఆ వేదికలపై ఎవరో గాలికి తోకలు పెట్టుకొని మన గోప్యత, మన గుర్తింపు, మన సంక్షేమం అడ్డగింతలవుతున్నాయి. ఒకప్పుడు పర్సన్ టు పర్సన్ మోసాలు, రోడ్డుపై చోరీలు కనిపించేవిబీ ఇప్పుడు ఆ మోసం మోసగాడు స్క్రీన్ కూడలి వెనకే కూర్చుని ఒక క్లిక్‌తో జీవితాన్ని తీయగలడు. ఈ మార్పు సామాజిక, ఆర్థిక, మానసిక అన్ని కోణాల్లో ప్రమాదకరం. సైబర్ క్రైమ్ విలయానికి కారణాలు విభిన్నంగా ఉన్నాయి. మొబైల్ పాకేజీలు, స్మార్ట్‌ఫోన్ల విస్తృతి, ఇన్వెక్టివ్ యాప్‌లలో దాచిన ఫిషింగ్ లింకులు, అక్రమ డేటా వ్యాపారాలు ఇవన్నీ కలిసి ఒక సంక్లిష్ట శ్రేణిని ఏర్పరుస్తున్నాయి. పాత నేరాలు కొత్త బట్టలు వేసుకునే తరహాలో ఉన్నాయి: ఫోన్ కాల్ ద్వారా భయపెట్టడం, ఇమెయిల్ ద్వారా ఉద్యోగ ఆఫర్ చూపించి పర్సనల్ డీటెయిల్స్ అడగడం, సోషల్ మీడియా ద్వారా నమ్మకాన్ని సంపాదించి చివరికి బ్లాక్‌మెయిల్ చేయడం. టెక్నికల్ పరిజ్ఞానం అందరికీ అందడంతో పాటు, దాని అపృత్యక్ష ఉపయోగం కూడా పెరిగింది డీప్ ఫేక్ లాంటి టెక్నాలజీలు సామాజిక అన్వయాన్ని మార్చే శక్తి. మరింత భకరమైన విషయం సైబర్ క్రైమ్ ఇప్పుడు కేవలం ధన గెలిచే నేరమే కాదుబీ అది గుర్తింపు తాపీ, పక్షపాతం, మరియు సామాజిక విభేదాల విత్తనంగా మారుతోంది. నకిలీ వీడియోలు, నిర్మలమైన చూపుల్ని కలిగించే ఆడియో క్లిప్స్ ప్రజల జీవితాలు నశింపజేస్తున్నాయి. ఒక అసత్య షేరు అయినా అది కొండగుట్టు దాడుల్ని, ఉపేక్షను, హత్యార్థక చర్చలను రేకెత్తిస్తుంది. ఇక్కడ ప్రశ్న: మనం చూస్తున్నది నిజమని అనుకోవడం ఎంత ప్రమాదకరం



అవుతుంది? ఆరుగురు లేదా పదులేని సందేహాలతో ప్రజల వ్యక్తిగత డేటా బంధించే వ్యాపారం ఉద్దేశపూర్వకంగా పయనిస్తోంది. వారికి డేటా అంటే తక్షణం లాభం. ఏ ఒక్క బ్యాంకింగ్ లింక్ కూడా తప్పుగా క్లిక్ చేయడం ద్వారా వ్యక్తిగత ఆర్థిక సమాచారం బయటపడగలదు. దాని దుష్ప్రభావం ఒక్క వ్యక్తి మీదటే కాదుబీ ఆ వ్యక్తి కుటుంబం, స్నేహితుల ముమ్మర సంబంధాలు, ఉద్యోగ జీవితమంతా అదృశ్యంగా మారిపోవచ్చు. ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటోంది ు ప్రత్యేక సైబర్ సెల్స్, శిక్షా చర్యా చట్టాలు, అవగాహన కార్యక్రమాలు మొదలైనవి. కానీ ఇక్కడ ముఖ్యమయిన విషయం ఆ చట్టాల అమలు ఎలా జరుగుతోంది అనేదే. క్రైమ్ అంతర్జాతీయ నేరజాలాలతో సంపృక్తమై ఉన్నప్పుడు, ఒక దేశీయ పోలీస్ స్టేషన్ అచేతనం అవ్వటం సహజం. నేరాల ట్రేసింగ్, డేటా రికవరీ, సర్వర్లకు యాక్సెస్ ు ఇవన్నీ అంతర్జాతీయ సహకారం లేకుండా సాధ్యం కాదు. అంతకుముందు సమాజంలో డిజిటల్ సావధానత పెంచకపోతే, చట్టాలు ఎందుకంటే తీవ్రత కలిగినా, ఆ రోగాన్ని గట్టిగా ఊపలేని అవకాశం ఉంటుంది.

ఇంకా ఒక మూల కారణం అవగాహన అంతా సరిగా లేదనేది. ''నాకు పడి ఉండదు'', ''నేను ఫ్రెండ్స్ తో ఉన్నాను'' అనే ఆత్మవిశ్వాసం ఎంతో మందికి ప్రమాదం అవుతోంది. పాత తాత్కాలిక శిక్షణలే క్రియాశీలంగా మారాల్సిన అవసరం ఉంది: పాఠశాలల్లో సైబర్ సెక్యూరిటీను కోర్సులో చేర్చడం, వృద్ధులు/గృహిణులకు ప్రత్యేక వర్క్‌షాప్‌లు, బ్యాంకింగ్ యూజర్లు కోసం క్లియర్ ఇవి ఇప్పుడు అత్యవసరం. చిన్న చిన్న శిక్షణలు: ఎప్పుడు ఇమెయిల్ లో ఉన్ లింక్ క్లిక్ చేయొద్దు, ఎక్కడైనా అడిగితే అక్షరార్థమై అందరికి చెప్పొద్దు, అనుమానాస్పద యాప్‌లకు పర్మిషన్లు ఇవ్వరాదు ు ఇవి మన దైరిక పనుల్లోకి మార్చాలి. పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యం కూడా ముఖ్యము. టెక్ కంపెనీలు తమ యాప్‌లలో భద్రతా ప్రమాణాల ఆధారం చూపించాలి. యూజర్ డేటాను ఎన్‌క్రిప్ట్ చేయడం మాత్రమే కాదు, యూజర్ ఎడ్యుకేషన్‌ను కూడా ఒక బాధ్యతగా గౌరవించాలి. మీడియా కూడా సంస్థాగత బాధ్యత ద్వారా ఇటువంటి అంశాలను మరింత సందర్భపూర్వకంగా వివరించాలి ఘటనల చేయకుండానే సమస్యకు పరిష్కార మార్గాలు చూపించాలి. కాను, సామాజిక స్థాయిలో చైతన్యం పెరగాలని, ప్రతి ఇంటిలోనూ ఒక డిజిటల్ రక్షణ సంస్కృతి ఏర్పడాలని మేము కోరుకోవాలి. తల్లిదండ్రులు చిన్నారులకు మొబైల్ ఇచ్చేముందే వారి వినియోగం, ఆప్ అనుమతులు, ఏ లింక్‌లను క్లిక్ చేయకూడదో, పాస్‌వర్డ్ మేనేజ్‌మెంట్ ఎలా చేసుకోవాలో నేర్పాలి. విద్యార్థులకు డిజిటల్ ఫిట్నెస్ చదివించాలి. ఉద్యోగస్థులకు కంపెనీలు రిమోట్ వర్క్ సెక్యూరిటీ నిబంధనలు ఇవ్వాలి. మీడియా కంపెనీలు ప్రకటనల్లో జాగ్రత్తగా ఉండాలి అన్న వాక్యాన్ని మనం ప్రయత్నిద్దాం ు నష్టాన్ని ప్రకటించి ఆఱ ప్రకటన తీసుకోవడమేననీ ఆలోచించాలి. అంతేకాదు, వ్యక్తిగతంగా మనం తీసుకోవాల్సిన చర్యలు స్పష్టంగా ఉండాలి: సంక్లిష్ట పాస్వర్డ్స్ పెట్టండిబీ రెండుదశల ధృవీకరణ యాక్టివేట్ చేసి ఉంచండిబీ అనుమానాస్పద లింక్స్‌ను కంటిన్యూ చేయద్దుబీ బ్యాంక్ మెసేజ్‌లను తక్షణమే తనిఖీ చేసుకోండిబీ పబ్లిక్‌పై జీవితం నమ్మొద్దుబీ అవసరమైతే డిజిటల్ క్లినప్ చేయించుకోండి. ఇవి సాదా చిట్కాలు కాకుండా ఒక జీవనశైలి అయిపోయేలా చేయాలి. సైబర్ క్రైమ్‌తో పోరాటం ఒకరి బలం మాత్రమే కాదు అది సమగ్ర సమాజ సంరక్షణ కావాలి. కుటుంబం, పాఠశాల, కంపెనీ, మీడియా, ప్రభుత్వం ు ఆరు కోణాలు ఒక కాలుష్యాన్ని తొలగించేలా కలిసి పనిచేస్తేనే ఈ అదృశ్య నేరాల నీడను చీల్చవచ్చును. చివరగా, వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరిలో ఒక చిన్న విద్య, ఒక చిన్న జాగ్రత్త మన జీవితాన్ని కాపాడుతుంది. డిజిటల్ సౌకర్యాన్ని మాకు దక్కిన తాజా బహుమతి అంటుకున్నామని భావిస్తే, దానితో వచ్చే బాధ్యతను కూడా మేము మర్చిపోకూడదు. రాతిన్ని డబ్బులు,

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in